


ట్రబుల్ షూటర్స్

తిరుపతి కార్పొరేషన్‌లో ఒకే ఒక్కడిని డిప్యూటీ మేయర్‌గా గెలిపించిన ఆధునిక చాణక్యులు

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్నది ఒకే ఒక్క సీటు. అయినా డిప్యూటీ మేయర్ పదవిని సొంతం చేసుకున్నారు. ఇదో అనూహ్య పరిణామం. రాజకీయాల్లో కీలకం వ్యూహం. పైకి ఎవరికి వారేగా కనిపించినా అవసర సమయాల్లో తిరుపతి కూటమి నేతలంతా ఒక్కటే అని నిరూపించిన సందర్భం. దౌర్జన్యపు రాజకీయ జెండాను ఐదేళ్లు తిరుగులేకుండా ఎగరేసిన వైసీపీకి దిమ్మతిరిగే సమాధానం ఈ విజయం. ఎలా సాధ్యం? దీని వెనుక ఎవరు కీలకం? తిరుపతి కూటమికి ప్రతిష్ఠాత్మకం. గెలుచుకుని తీరాల్సిందే అంటూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సారథ్యంలో రంగంలోకి దిగారు ట్రబుల్‌షూటర్స్. ఐదేళ్లు.. వైసీపీ వేసిన దారులే వారిని నడిపించాయి. వారు నేర్పిన విద్యను వారి మీదే ప్రయోగించారు. ఒకే ఒక్కడిని గెలిపించి చూపించారు. ఆ ట్రబుల్ షూటర్స్ కథాకమామిషు.. చదవండి 8లో

హైకోర్టు సీజేకి ఘనస్వాగతం

రేణిగుంట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట విమానాశ్రయంలో శుక్రవారం సాయంత్రం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్‌కు ఘన స్వాగతం లభించింది. మదనపల్లె, పలమనేరులో నూతనంగా నిర్మించిన కోర్టులను ప్రారంభించేందుకుగాను ఆయన వచ్చారు. విమానాశ్రయం వద్ద సీజేకి జేసీ శుభం బన్సల్, తిరుపతి మూడో ఏడీజే కోర్టు న్యాయమూర్తి ఎం.గురునాథ్, ప్రొటోకాల్ జడ్జి కోటేశ్వరరావు, కోర్టు సూపరింటెండెంట్ ధనంజయులు నాయుడు, తిరుపతి బార్ కౌన్సిల్ సభ్యులు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన మదనపల్లెకు బయలుదేరి వెళ్లారు.



శ్రీకాళహస్తి పరిధిలో ఓ గ్రావెల్ మాఫియా చెలరేగిపోతోంది. అధికారుల తెరచాటు సహకారంతో రాత్రి, పగలు గ్రావెల్‌ను తవ్వేస్తోంది. తొట్టంబేడు మండలం శివనాథపాళెం పరిధిలో చేపట్టిన ఈ అక్రమ గ్రావెల్ తవ్వకం... అక్రమార్కులకు రూ.కోట్లు కురిపిస్తోంది.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



శ్రీకాళహస్తిలో

మట్టి దొంగలు

శివనాథపాళెం చెరువులో వేసిన అక్రమార్కులు వేసిన రోడ్డు

శ్రీకాళహస్తి పట్టణంలో గ్రావెల్‌కు మంచి డిమాండ్ ఉంది. ఇళ్ల నిర్మాణానికి, రియల్‌ఎస్టేట్ వెంచర్లకు, లోతట్టు స్థలాలను ఎత్తు లేపుకునేందుకు కొంటున్నారు. అలాగే శ్రీసిటీ, రేణిగుంట, ఏర్పేడు, చెన్నై ప్రాంతాలకూ కొందరు అక్రమార్కులు గ్రావెల్‌ను తరలిస్తున్నారు. శ్రీకాళహస్తి శివారు చెన్నై రోడ్డులోని ఓ పెట్రోల్ బంకు పక్కన గ్రావెల్ మాఫియా ఒక ముఠాగా ఏర్పడి ఆరు నెలల క్రితం కార్యాలయాన్నీ ఏర్పాటు చేసుకుంది. ఆ కార్యాలయం వెనుకనే రెండు నెలల క్రితం భారీ ఇసుక డంప్‌ను అధికారులు సీజ్ చేశారు. అప్పటి వరకు చెన్నైకి ఇసుక తరలిస్తున్న ఆ ముఠా.. తర్వాత గ్రావెల్‌వైపు దృష్టి పెట్టింది. తొట్టంబేడు మండలం శివనాథపాళెం పరిధిలోని భూములను తవ్వకాలకు ఎంపిక చేసుకుంది. ఇక్కడే తెలుగుగంగ కాలువ కట్టకు ఆనుకుని శివనాథపాళెం చెరువు ఉంది. మూడేళ్ల కిందట జాతీయ రహదారి నిర్మాణానికి శివనాథపాళెంలో గ్రావెల్ తవ్వుకోవడానికి సంబంధిత సంస్థ ప్రభుత్వం నుంచి అనుమతి పొందింది. అప్పటి వైసీపీ నాయకులు ఆ సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా చెరువులో వాహనాల రాకపోకలకు అనుమతించారు. అప్పట్లో ఆ సంస్థ చెరువులో తాత్కాలిక బాటను వేసుకుంది. వారి కాలపరిమితి ముగియడంతో అధికారులు చెరువులో బాటకు కందకాలు తవ్వి అడ్డుకట్ట వేశారు. వర్షాలతో చెరువులో బాటా కనుమరుగైంది. రెండు నెలల క్రితం గ్రావెల్ మాఫియా కళ్లు శివనాథపాళెంపై పడ్డాయి. చెరువులో పాతబాటపై భారీ లారీలు తిరిగేలా అనధికారికంగా రోడ్డు వేసుకున్నారు. చెరువు నుంచి ఆ పక్కనే ఉన్న పొలాల్లోకి వెళ్లి గ్రావెల్ తవ్వేసి రోజూ లక్షలాది రూపాయలకు అమ్మి సొమ్ము చేసుకోవడం ప్రారంభించారు.



శివనాథపాళెంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిగిన దృశ్యం

రెండు నెలల్లో 20 ఎకరాల్లో తవ్వేశారు

నీలగిరి, తైలం చెట్ల మధ్యలో బీడు భూములు ఉన్నాయి. ఎవరి కంటా పడకుండా గ్రావెల్ తవ్వేందుకు పక్కాగా పథకం రచించారు. ఆ ప్రకారం రాత్రి పది నుంచి వేకువజామున 5గంటల వరకు యంత్రాలతో లారీలు, ట్రాక్టర్లకు తవ్వి నింపి పంపించేవారు. ఇలా రెండు నెలల నుంచి సుమారు 20 ఎకరాల్లో గ్రావెల్‌ను తవ్వేశారు. కొందరు అధికారులు వీరికి అండగా నిలిచారన్న ఆరోపణలున్నాయి. కొందరు అక్రమార్కులు, అధికారులు కలిసి చేస్తున్న ఆగడాలతో కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే ప్రమాదం ఉంది. ఇటీవల వారం రోజులుగా శివనాథపాళెం పరిసర గ్రామాల ప్రజలు గ్రావెల్ మాఫియాపై అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి శివనాథపాళెం, చిట్టత్తూరు, తెల్లరాళ్ల మిట్ట గ్రామాల్లో గ్రావెల్ మాఫియా తవ్వకాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కరాటే, తైక్వాండో

శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కరాటే, తైక్వాండో స్వీయ రక్షణ కళల్లో శిక్షణ ఇచ్చేందుకుగాను శిక్షకులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కేవీఎన్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్ కార్యక్రమంలో భాగంగా 141 ప్రాథమికోన్నత పాఠశాలల్లోని 2,458 విద్యార్థినులకు, 318 ఉన్నత పాఠశాలల్లోని 30,935 మంది విద్యార్థినులకు 20 సెషన్లుగా కరాటే, తైక్వాండోలో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. సంబంధిత ట్రస్ట్‌లు, సొసైటీల్లో రిజిస్టర్ అయినవారు, శిక్షణలో కనీసం మూడేళ్ల అనుభవం కలవారు 11వ తేదీ మధ్యాహ్నంలోపు దరఖాస్తు చేసుకోవాలి. ఇతర వివరాలకోసం కలెక్టరేట్‌లోని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ కార్యాలయంలో సంప్రదించాలి' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆ ఎక్స్‌కవేటర్‌ను తప్పించింది ఎవరు?

- ఇసుక అక్రమ రవాణాపై అధికారుల దాడులు
- ఐదు ట్రాక్టర్ల సీజ్



చంద్రగిరి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖిలో ఇసుక తవ్వి ట్రాక్టర్లకు పోస్తున్న ఎక్స్‌కవేటర్‌ను పట్టుకున్నాక.. తప్పించింది ఎవరు? పోలీసులా లేదా రెవెన్యూ సిబ్బందా అనేది చర్చనీయాంశంగా మారింది. దీనిపై అధికారులు విచారణ చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. చంద్రగిరి మండలంలోని తొండవాడ నుంచి నరసింగాపురం వరకు స్వర్ణముఖినదిలో రాత్రింబవళ్లు ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. దీంతో గురువారం తహసీల్దార్ శివరామసుబ్బయ్య రెవెన్యూ, పోలీసులతో సంయుక్తంగా బృందాలు ఏర్పాటు చేశారు. కాగా, గురువారం రాత్రి చంద్రగిరి బ్రహ్మంగారిగుడి వద్ద భారీగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్టు తహసీల్దార్‌కి సమాచారం వచ్చింది. రెవెన్యూ బృందం, పోలీసులు కలిసి రాత్రి 11 గంటల సమయంలో దాడులు నిర్వహించారు. ఐదు ఇసుక ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను పట్టుకున్నారు. స్వర్ణముఖి నది నుంచి పోలీస్ స్టేషన్‌కు వాహనాలను తీసుకెళ్లే క్రమంలో ఎక్స్‌కవేటర్‌ను కొందరు తప్పించారు. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరగా ఐదు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి, పోలీసులకు అప్పగించామన్నారు. ఎక్స్‌కవేటర్‌ను పోలీసులు తప్పించారా లేదా రెవెన్యూ సిబ్బందా అనేది విచారిస్తున్నామన్నారు.

చంద్రగిరి ఎమ్మెల్యేను కలిసిన డిప్యూటీ మేయర్



ఎమ్మెల్యే నాని దంపతులను సన్మానిస్తున్న మునికృష్ణ

చంద్రగిరి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని కొత్తగా ఎన్నికైన తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే దంపతులకు శాలువా కప్పి సాయిబాబా చిత్రపటాన్ని అందజేసి, తిరుమల ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహేష్ యాదవ్, ఎస్వీఎం శ్రీధర్, జగ్గా, రవితేజ నాయుడు, ప్రభాకర్‌నాయుడు, మణినాయుడు, చంద్రారెడ్డి, తీరుష్, బాలాజీ, హేమంత్ పాల్గొన్నారు.

వేడుకగా తిరువీధి ఉత్సవం



తిరుచ్చిపై ఊరేగుతున్న పద్మావతి అమ్మవారు

తిరుచానూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారికి శుక్రవారం రాత్రి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి మూలమూర్తికి అర్చకులు అభిషేకం నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లకు కల్యాణోత్సవం చేశారు. మధ్యాహ్నం తిరుమంజనం నిర్వహించారు. రాత్రి సర్వాలంకార శోభితురాలైన అమ్మవారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న వసంతబాయి

తిరుచానూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ పీడీ వసంతబాయి కోరారు. తిరుచానూరు రోడ్డులోని మహిళా ప్రాంగణంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలల పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీల బలోపేతంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా ప్రాంగణం మేనేజరు ఫర్జానా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

20 నుంచి ముక్కోటిలో మహాశివరాత్రి ఉత్సవాలు

చంద్రగిరి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండవాడ స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకు మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి తెలిపారు. 20న సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ ఉంటుందని పేర్కొన్నారు. 24న ఉదయం 7.30 గంటలకు రథోత్సవం, 26న రాత్రి 7 గంటలకు నంది వాహనం, 27న సాయంత్రం 6 గంటలకు కల్యాణోత్సవం, 28న రాత్రి 7 గంటలకు శయనోత్సవం, ఊంజల్‌సేవతో మహాశివరాత్రి ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తిరుచ్చిపై రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు



చంద్రగిరి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు ఉత్సవర్లు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, తిరుచ్చి వాహనంపై నాలుగు మాడ వీధుల్లో ఊరేగిస్తూ భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, అర్చితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి రెండు కణితుల మృతి!

భాకరాపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచర్ల పంచాయతీ తుమ్మచేనుపల్లె అటవీ సరిహద్దు ప్రాంతంలో అడవి జంతువుల కోసం తీసిన విద్యుత్ తీగలు తగిలి రెండు కణితలు మృతి చెందినట్లు సమాచారం. భాకరాపేట అటవీ శాఖాధికారులు గ్రామంలో సోదాలు చేసి, కొంత మాంసాన్ని స్వాధీనం చేసుకుని, పలువురిని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై అటవీ అధికారులను వివరణ కోరగా గ్రామంలో అనుమానితుల ఇళ్ల వద్ద వెదికామని, ఎలాంటి మాంసమూ దొరకలేదని తెలిపారు.

ముద్దుకృష్ణమకు ఘన నివాళి



దుప్పట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

రామచంద్రాపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ముద్దుకృష్ణమ నాయుడు 7వ వర్ధంతిని పురస్కరించుకుని స్వగ్రామం వెంకట్రామపురంలోని ఆయన సమాధి వద్ద శుక్రవారం కుమారుడు, ఎమ్మెల్యే భానుప్రకాష్ నివాళులర్పించారు. అనంతరం కమ్మపల్లె పీహెచ్‌సీకి రూ.30వేలు విలువ చేసే దుప్పట్లు, దిండ్లు వైద్యాధికారి జావేద్‌కు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చిన్నబాబు, రజనీకాంత్, మాజీ ఎంపీటీసీ సురేష్‌నాయుడు, మధు, బాలసురేష్, చంద్రశేఖర్, కుమార్, మునిరత్నంనాయుడు పాల్గొన్నా రు. కమ్మకండ్రిగ గ్రామంలో మాజీ జడ్పీటీసీ దేవానం దమనాయుడు ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

ముగిసిన రాజశ్యామలదేవి నవరాత్రులు



రామచంద్రాపురరం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): శ్రీశక్తిపీఠంలో తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన రాజశ్యామలదేవి నవరాత్రులు శుక్రవారం ముగిశాయి. మరకత శక్తికాళీ, రాజశ్యామల దేవికి తిరుమంజనం నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం 9 గంటలకు వేదపండితులు రాజశ్యామల హోమాన్ని ప్రారంభించగా మధ్యాహ్నం 12గంటలకు కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి పూర్ణాహుతితో ముగించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు.

తేనెమంచు పురుగు నివారణ చర్యలు చేపట్టండి



రైతుకు సూచనలిస్తున్న శివకుమారి

భాకరాపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మామిడిలో ఈ ఏడాది పూత బాగా వస్తోందని, అయితే తేనెమంచు పురుగు ఆశిస్తోందని, దాని నివారణ చర్యలు చేపట్టాలని చిన్నగొట్టిగల్లు మండల ఉద్యాన శాఖాధికారిణి శివకుమారి తెలిపారు. శుక్రవారం చట్టేవారిపాళెం పంచాయతీలో మామిడి తోటలను ఆమె పరిశీలించి, రైతులకు సూచనలు చేశారు. మామిడి పూతను పక్షి కన్ను, మసి తెగులు వంటివి ఆశిస్తాయని, వాటి నివారణకు బుప్రోపెజిన్ 15 మిల్లీలు, ఆసిఫేట్ ఒక గ్రాము, హెక్సాకోనజోల్ రెండు మిల్లీలు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. తెల్లపూత దశలో ఉన్నప్పుడు పరాగ సంపర్కం జరిగి పిందె ఏర్పడే దశలో తేనెటీగల సంచారం అవసరం కాబట్టి ఎలాంటి పురుగు మందులూ పిచికారీ చేయరాదన్నారు.

రిలయన్స్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక



అంజలి

భాకరాపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారిగడ్డకు చెందిన ఎం.అంజలి రిలయన్స్ ఫౌండేషన్ అండర్ గ్రాడ్యుయేషన్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ఆమె తండ్రి బాబు తెలిపారు. అంజలి ప్రస్తుతం ఇడుపుల పాయలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బీటెక్ చదువుతోంది. గత ఏడాది అక్టోబరులో జరిగిన ఎంపిక పరీక్షలో ప్రతిభ చూపి స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. ఆమెకు బీటెక్‌లోని నాలుగు సంవత్సరాలకు రూ.2 లక్షల స్కాలర్‌షిప్‌ను రిలయన్స్ ఫౌండేషన్ అందించనుంది.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

పాకాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి కోరారు. మండలంలోని గాదంకి, శంఖంపల్లె, నేండ్రగుంట పంచాయతీలలో శుక్రవారం నిర్వహించిన మహిళల ఆత్మీయ సదస్సులో ఆమె పాల్గొన్నారు. మహిళలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మహిళలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బి.నాగరాజ నాయుడు, కార్యదర్శి పల్లుజ, బొల్లినేని మహేష్ కుమార్, కె.సావిత్రి, చాముండేశ్వరి, రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి



మాట్లాడుతున్న సీఐ సుదర్శన్ ప్రసాద్

పాకాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని సీఐ సుదర్శన్ ప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల 31వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ బేబీశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో సీఐ మాట్లాడుతూ విద్యార్థులు సమాజం పట్ల బాధ్యతగా ఉండాలని, క్రమశిక్షణతో మెలగాలని కోరారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ వై.వెంకటరత్నంనాయుడు, హెచ్ఎం జయచంద్ర, అభివృద్ధి కమిటీ కార్యదర్శి ఆర్సీ ప్రసాద్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ప్రదేశాలను శుభ్రం చేయిస్తున్న డీఎస్పీ ప్రసాద్

పాకాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవడానికి అందరూ కృషి చేయాలని డీఎస్పీ బీప్రసాద్ అన్నారు. శుక్రవారం పంచాయతీ సిబ్బంది, స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్నారు. రామకృష్ణ డీలక్స్ థియేటర్ సమీపంలో పరిసరాలను శుభ్రం చేయించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో సీఐ సుదర్శన ప్రసాద్, ఎస్సై సంజీవరాయుడు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా గ్రామ పంచాయతీల అభివృద్ధి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే నాని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. తిరుపతి రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ యశోద అధ్యక్షతన శుక్రవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గత మండల పరిషత్ సమావేశం దృష్టికి తెచ్చిన 70 శాతం సమస్యలను పరిష్కరించామన్నారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి గ్రామాల్లో పూర్తిస్థాయిలో రోడ్లు నిర్మిస్తామని, పంచాయతీల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. తొండవాడ, దుర్గసముద్రం, కొత్తపాళెంలోని పీఎంఏవై-ఎన్టీఆర్ నగర్లలో అన్ని సదుపాయాలు కల్పించి, ఆధునాతనంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. రైతులు తమ పొలాల్లోని కలపను ఇంటి అవసరాలకు తీసుకెళుతుండగా ఫారెస్ట్ అధికారులు ఫైన్ వేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని, ఇది సరికాదని చెప్పగా కటింగ్ పర్మిషన్ తీసుకోవాలని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రమాదకర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అంగన్వాడీ భవనాలు నిర్మించాలని, వేసవిని దృష్టిలో ఉంచుకుని బోర్లు, మోటార్లు ఏర్పాటు చేయాలని, డ్రైన్లు ఏర్పాటు చేయాలని, వేదాంతపురం వాటర్‌సంప్‌ని వినియోగంలోకి తేవాలని, దామినేడుకు శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని, ఎంపీటీసీలకు ప్రోటోకాల్ అమలు చేయాలని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి పంచాయతీలకు రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ నిధులు అందించే చర్యలు చేపట్టాలని, ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని విన్నవించారు. చంద్రగిరి నుంచి గాజులమండ్యం వరకు అవసరమైన చోట ఫ్లైఓవర్లు, అండర్‌బ్రిడ్జిల ఏర్పాటుకు చొరవచూపాలని పలువురు సర్పంచ్‌లు విన్నవించారు. వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, ఎంపీడీవో రామచంద్ర, అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, రూరల్ డీటీ జయంత్‌కుమార్ పాల్గొన్నారు.

సోలార్ రూఫ్‌టాప్ కనెక్షన్‌తో విద్యుత్ చార్జీలు ఆదా చేసుకోండి



తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫత్ బిజిలీ యోజనలో భాగంగా సోలార్ రూఫ్‌టాప్ కనెక్షన్‌తో విద్యుత్ చార్జీలు ఆదా చేసుకోవాలని సదరన్ డిస్కం ఎస్ఈ పి.సురేంద్రనాయుడు శుక్రవారం సూచించారు. వినియోగదారులు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవడానికి ఒక కిలోవాట్‌కు రూ30,000, 2 కిలోవాట్స్‌కు రూ60,000, మూడు కిలోవాట్స్‌కు రూ78,000 చొప్పున కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. ఈ పథకం రూపంలో వినియోగదారులకు నెలకు 300 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ఉంటుందన్నారు. మిగిలిన విద్యుత్‌కు ధర నిర్ణయించి సంస్థ కొనుగోలు చేస్తుందన్నారు. వినియోగదారులనుంచి విద్యుత్ కొనుగోలు చేయడంతో ఏడాదికి సమారు రూ.18వేల వరకు రాయితీ వస్తుందన్నారు. ఈ పథకంపై తమ కార్యాలయంలో శని, ఆదివారాల్లో జరిగే అవగాహన కార్యక్రమానికి వినియోగదారులు హాజరు కావాలని కోరారు.

ఐదుగురు 'ఎర్ర' దొంగలకు ఏడాది జైలు

- రూ.మూడు వేల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఐదుగురు నిందితులకు ఏడాది జైలు, రూ.3000 చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి అదనపు జిల్లా న్యాయమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. అటవీశాఖ లైజన్ సహాయ లైజన్ అధికారి, ఫారెస్టు బీట్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. నంద్యాల జిల్లా రుద్రవరం మండలం ఆలమూరుకు చెందిన జి.వెంకటరమణ, పి.నరసింహులు, ఎ.మద్దిలేటి, షేక్ హుస్సేన్, పి. ప్రసాద్ స్థానికంగా కూలి పని చేసుకునేవారు. 2011 ఆగస్టు 13న నంద్యాల రిజర్వు ఫారెస్టు నుంచి తొమ్మిది ఎర్రచందనం దుంగలు తీసుకుని తెలుగుగంగ ప్రాజెక్టు బంతిమెర్రి బ్రిడ్జి వద్ద దాచి పెట్టడానికి వస్తున్నారు. ఈ విషయం తెలిసిన అటవీశాఖ అధికారులు వీరిని గుర్తించి పట్టుకోవడానికి ప్రయత్నించారు. దీంతో దుంగలు పడేసి పరిగెత్తిన వీరిని వెంబడించి పట్టుకున్నారు. రుద్రవరం మండల పరిధిలో అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఆళ్లగడ్డ జ్యుడిషియల్ న్యాయమూర్తి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. తదుపరి రెండేళ్ల అనంతరం ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి వీరికి ఏడాది జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.3000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ నిందితుల తరపున న్యాయవాది తిరుపతి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎదుట అప్పీలు పిటిషన్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోటేశ్వర రెడ్డి వాదనలు వినిపించారు. ఈ కేసులో లైజన్ అధికారిగా చంద్రశేఖర రాజు, సహాయ లైజన్ అధికారిగా వెంకటేశ్వర్లు వ్యవహరించారు. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి.. కింది కోర్టు విధించిన శిక్షనే ఖరారు చేస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు.

పెద్దిరెడ్డి కబ్జా నుంచి మా భూమి మాకు ఇప్పించండి

- మీడియా సమావేశంలో సుధీర్ వేడుకోలు



తిరుపతి(లీలామహల్), ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం చింతలచేను రెవెన్యూ పరిధిలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కబ్జా చేసిన తమ భూమిని తమకు ఇప్పించాలని బాధితుడు నక్కా సుధీర్ వేడుకున్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. '1981లో ఈఆర్.అమర, మునెమ్మ నుంచి మా తండ్రి ఆ భూమిని కొనుగోలు చేశారు. మాతోపాటూ మరో ఆరుగురు కూడా బాధితులు ఉన్నారు. మొత్తంగా 50 సెంట్ల భూమిని కబ్జా చేశారు. దీని విలువ రూ.30 కోట్లు ఉంటుంది. ఈ విషయమై ఎన్ని ఫిర్యాదులు చేసినా న్యాయం జరగడం లేదు. బాధితులంతా సీనియర్ సిటిజన్స్ కావడంతో పోరాడే శక్తి లేదు. దీనిపై ఆర్డీవో, ఎస్పీలకు ఫిర్యాదులు చేశాం. కోర్టులోనూ కేసు వేశాం. ప్రస్తుతం అక్కడ నిర్మాణాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించి మాకు న్యాయం చేసి భూమి ఇప్పించాలి' అని బాధితుడు కోరారు. ఈ సమావేశంలో వెంకటరమణరామరాజు, చెంగల్రాజు, రెడ్డయ్య రాజు, నూర్‌జాన్, ఫాతిమా, తనూజ, రసూల్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రాంతాల ప్రగతే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్

ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు



పార్లమెంటులో మాట్లాడుతున్న దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పల్లె ప్రాంతాల ప్రగతే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ ప్రకటించారని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. శుక్రవారం ఢిల్లీలోని పార్లమెంటు సమావేశాల్లో జరిగిన 2025 ఆర్థిక బడ్జెట్ చర్చల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ సర్కార్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రపంచాన్ని ఆకర్షిస్తోందని చెప్పారు. గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయ రంగాలకు ఊతమిచ్చారని ప్రశంసించారు. మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం దిశగా ముందుకు సాగుతున్నారని అన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి విభజన చట్టాన్ని అమలు పరచడంలో భాగంగా ఎన్డీయే సర్కార్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఈ బడ్జెట్‌లో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి రూ.11,440 కోట్లు, సౌత్ కోస్ట్ రైల్వే జోన్ స్థాపనకు రూ.15వేల కోట్లు, అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించిందని కొనియాడారు.

చెట్టుకొమ్మ విరిగిపడి కూలీ మృతి

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): చెట్టుకొమ్మ నరుకుతుండగా కొమ్మతో కలసి కింద పడి ఒక కూలీ మృతి చెందిన ఘటన శుక్రవారం తిరుపతిలోని తెలుగునగర్‌లో చోటు చేసుకుంది. ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన ప్రకారం.. మునిరాజ ఇంటి వద్ద పెద్ద చెట్టు వుంది. అక్కడ ఖాళీ స్థలంలోని చెట్టు నరుకుతుండగా చెట్టుపై నుంచి కింద పడి శెల్వరాజ్ (35) అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమల స్థానికులకు విద్యుత్ ఛార్జీల మోత

- రూ.2 వేల నుంచి రూ.3 వేలతో బిల్లులు వస్తున్నాయంటూ ఆవేదన

తిరుమల, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): తిరుమలలో నివాసం ఉంటున్న స్థానికులపై విద్యుత్ ఛార్జీల మోత మోగుతోంది. రూ.500 నుంచి రూ.800 లోపు వచ్చే ఛార్జీలు ఇప్పుడు ఏకంగా రూ.2 వేల నుంచి రూ3 వేలు వస్తుండటంతో 'షాక్'కు గురవుతున్నారు. తిరుమలలోని బాలాజీనగర్‌లో 1,060, ఆర్బీ సెంటర్‌లో మరో 81 ఇళ్లు ఉన్నాయి. వీటికి టీటీడీ నుంచే విద్యుత్ సరఫరా జరుగుతోంది. ప్రతినెలా కరెంట్ బిల్లులను టీటీడీనే వసూలు చేస్తుంది. సాధారణంగానే తిరుమలలో ఇళ్లు చాలా ఇరుకుగా ఉంటాయి. రెండు లైట్లు, ఓ ఫ్యాన్, టీవీ తప్ప పెద్దగా వినియోగం ఉండదు. చల్లటి వాతావరణమే అధికం. దీతో ఏసీ వాడరు. ఈక్రమంలో ఛార్జీలు కూడా రూ.300 నుంచి రూ.900 లోపే ఉంటాయి. ఇటీవల పెరుగుతున్న విద్యుత్ ఛార్జీలను చూసి స్థానికులు అవాక్కవుతున్నారు. ఓ ఇంట్లో ప్రతి నెలా రూ.700 నుంచి రూ.900 మాత్రమే వచ్చే బిల్లు.. డిసెంబరు నెలకు రూ.2,077 ఛార్జ్ రావడంతో షాక్ అయ్యారు. దీనిపై సంబంధిత విద్యుత్ విభాగం సిబ్బందిని ప్రశ్నిస్తే 'మీరు అంతే వాడుంటారు. వెళ్లి బిల్లు కట్టేరండి' అని సమాధానం చెప్పారు. మరో ఇంట్లో ప్రతినెలా రూ.500 నుంచి రూ.800లోపు వచ్చే బిల్లు, జనవరికి రూ.1,931 వచ్చింది. ఈ విషయాన్ని టీటీడీ విద్యుత్ విభాగం అధికారుల దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకెళ్లగా 'ఎస్పీడీసీఎల్ నార్మ్స్ ప్రకారం బిల్లులు వేయడం జరుగుతోంది. పెరిగిన ఛార్జీలపై పరిశీలన చేస్తాం' అంటూ బదులిచ్చారు.

పోలీసు శాఖకు ద్విచక్ర వాహనాలు అందిస్తాం

- ఎస్పీని కలసిన హీరో మోటార్స్ ప్రతినిధులు



తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 'గతంలో పోలీసు శాఖకు తమ సంస్థ తరఫున 225 ద్విచక్ర వాహనాలు అందజేశాం. ప్రస్తుతం మళ్లీ సహకారం అందించడానికి మా సంస్థ సిద్ధంగా ఉంది' అని తిరుపతిలోని పృథ్వీ హీరో మోటార్స్ అధినేత పృథ్వీరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఎస్పీ క్యాంపు కార్యాలయంలో హర్షవర్ధన్‌రాజును కలిశారు. పోలీసు శాఖకు సంస్థ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఎస్పీ అడిగారు. 'తిరుపతిలో నార్కోటిక్ డ్రగ్స్ నివారణకు అవసరమైన విధంగా వాహనాలను ప్రత్యేకంగా రూపొందించి ఇవ్వాలి. చిన్న చిన్న వీధుల్లోకి వెళ్ళే చిన్నపాటి అగ్ని ప్రమాదాలు నివారించే పరికరాలు అమర్చిన బైకులను అందించాలి' అని ఎస్పీ కోరారు. దీనిపై హీరో సంస్థ ప్రతినిధులు అంగీకరించారు. త్వరలో ఆయా మార్పులతో ద్విచక్రవాహనాలను రూపొందించి అందచేస్తామని హామీ ఇచ్చారు. ఎస్పీని కలసిన వారిలో శ్రీసిటీ హీరో మోటార్స్ ప్లాంట్ హెడ్ తీరన్, సంస్థ సిబ్బంది ఉన్నారు.

అంతా గోప్యమే!

- పెద్దిరెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ బృందం

కల్లూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):పులిచెర్ల మండలం మంగళంపేట సమీప అటవీ ప్రాంతంలో వున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యవసాయక్షేత్రాన్ని శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు, జేసీ విద్యాధరి, డీఎఫ్‌వో భరణి తదితర అధికారుల బృందం పరిశీలించింది.పెద్దిరెడ్డి భూ ఆక్రమణలపై ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో గత శుక్రవారం ఆ భూములున్న ప్రాంతాన్ని జేసీ విద్యాధరి, డీఎఫ్‌వో భరణి పరిశీలించి సర్వే చేశారు కానీ వివరాలు బయటకు వెల్లడించలేదు.వారం రోజుల తరువాత రెండవసారి జేసీ విద్యాధరి, డీఎఫ్‌వో భరణి, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ జయసింహ, ఎస్ఐ వెంకటేశ్వర్లు శుక్రవారం ఉదయం ఆ ప్రాంతానికి చేరుకున్నారు. మరికొంత సేపటికి కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ అక్కడికి చేరుకుని అధికారులతో మాట్లాడారు.ఒక గంట తరువాత కలెక్టర్, ఎస్పీ వెళ్లిపోగా మధ్యాహ్న సమయానికి మిగిలిన అధికారులు అక్కడినుంచి కల్లూరు జడ్పీ బంగళాకు చేరుకున్నారు. మధ్యాహ్న భోజనం తరువాత మరోసారి వ్యవసాయ క్షేత్రం వద్దకు చేరుకున్న వారు సాయంత్రం వెనుదిరిగారు. అక్కడ పరిశీలించిన అంశాలను బయటకు వెల్లడించకుండా గోప్యత పాటించారు. ఆ వ్యవసాయ క్షేత్రానికి వెళ్లే మార్గంలో సుమారు 5 కి.మీ దూరం ముందే పోలీసులు లోపలికి ఎవరినీ అనుమతించలేదు. ఆ మార్గంలో భూములున్న రైతులను సైతం వారి భూముల వద్దకు వెళ్లేందుకు ఆ మార్గంలో అనుమతించకపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు.



మూడుచక్రాల సైకిల్‌పై విజయవాడకు వెళుతున్న దివ్యాంగుడు బాలకృష్ణ

డిప్యూటీ సీఎంను కలిసేందుకు దివ్యాంగుడి సైకిల్‌యాత్ర

- కుమార్తె వైద్యం కోసం సాహసం

శాంతిపురం, బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న తన కుమార్తెకు వైద్యం చేయించి ఆదుకోవాలని కోరుతూ తన సమస్యను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు తెలియజేయడానికి ఆయన అభిమాని దివ్యాంగుడు బాలకృష్ణ శుక్రవారం సైకిల్‌యాత్ర చేపట్టారు. శాంతిపురం మండలం కోలాల తిమ్మసపల్లె గ్రామానికి చెందిన ఆయన తన మూడుచక్రాల సైకిల్‌పై బయలుదేరి శాంతిపురం నుంచి బైరెడ్డిపల్లెకు చేరుకున్నాడు. అతడి కథనం మేరకు.. బాలకృష్ణ దంపతులిద్దరూ దివ్యాంగులు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మొదటి కుమార్తె అశ్విని ప్రస్తుతం తొమ్మిదో తరగతి, రెండో కుమార్తె హేమలత ఆరో తరగతి, కుమారుడు చందన్‌కుమార్ నాలుగో తరగతి చదువుతున్నారు. తనకు ప్రతి నెలా వచ్చే వికలాంగ పింఛనుతో జీవనం గడుపుతున్నారు. తన పెద్ద కుమార్తె అశ్విని అనారోగ్యానికి గురికావడంతో గత మూడేళ్ల క్రితం చెన్నైలోని ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించగా బ్రెయిన్‌కు సంబంధించిన వ్యాధి ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. వైద్యం చేయడానికి దాదాపు రూ.14 లక్షలు ఖర్చవుతుందని చెప్పడంతో బాలకృష్ణకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. అప్పటినుంచి ఎంతోమంది ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి తన బాధ చెప్పుకున్నప్పటికీ ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. మొదటి నుంచి పవన్‌కల్యాణ్‌కు అభిమానినైన తాను ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను స్వయంగా కలిసి సమస్యను విన్నవించడానికి సైకిల్‌యాత్ర చేపట్టినట్లు చెప్పారు. తన కుమార్తెకు వైద్యం చేయించి ఆదుకోవాలని దివ్యాంగుడు బాలకృష్ణ తెలిపారు.

కార్పొరేషన్ ఏడీసీ చరణ్‌తేజ్ రెడ్డి బదిలీ

తిరుపతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ (ఏడీసీ)గా పనిచేస్తున్న చరణ్‌తేజ్ రెడ్డిని మాతృసంస్థకు రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఆ మేరకు శుక్రవారం మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల బదిలీలలో భాగంగా స్టేట్ ఆడిట్ విభాగంలో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సి.చరణ్ తేజ్ రెడ్డిని గత ఏడాది ఫిబ్రవరిలో డిప్యుటేషన్‌పై తిరుపతి ఏడీసీగా నియమించింది. ఏడాది తర్వాత తిరిగి మాతృసంస్థ స్టేట్ ఆడిట్ విభాగానికి బదిలీ చేసింది.

సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ క్రీడల్లో ప్రతిభ



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

తిరుపతి(క్రీడలు), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరంలో జరిగిన సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రీడల్లో ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు రాణించారు. ప్రిన్సిపాల్ డాక్టర్.బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల ఆవరణలో అభినందన సభ ఏర్పాటు చేశారు. క్రీడల్లో రాణించిన జి.నవీన్(క్రికెట్), టి.డిస్మిత(ఉమెన్‌క్రికెట్), డి.రఘునాథ్(బ్యాడ్మింటన్), పి.నందకుమార్(జూడో), కె.నాగేశ్వరి(ఉమెన్స్ కబడ్డీ), ఎం.భరత్(వాలీబాల్), టి.మహేష్(కో కో), షేక్‌బాబాఫక్రుద్దీన్(హాకీ), సి.మాలిని(వాలీబాల్), ఎస్.ఎస్.బాలాజీ(చదరంగం)లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఫిజికల్ డైరెక్టర్ పి.కుమార్, వైస్ ప్రిన్సిపాల్ పరమేశ్వర పాల్గొన్నారు.

శెట్టిపల్లి భూసమస్య పరిష్కారానికి చర్యలు

మూడు వారాల్లో లేఅవుట్ ప్రొసీడింగ్స్ : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (కలెక్టరేట్), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామని, మూడు వారాల్లో ప్లాట్లు వేసి, లబ్ధిదారులకు హక్కు పత్రాలు అందజేస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో శెట్టిపల్లి భూసమస్యపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. మూడు వారాల్లో తుడా ఆధ్వర్యంలో శెట్టిపల్లి భూముల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. పేపర్ ప్లాటింగ్, రహదారుల ఏర్పాటు, మౌళిక సదుపాయాల కల్పన కోసం చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, తుడా వీసీ మౌర్య, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, ఎస్‌డీసీ సృజన పాల్గొన్నారు.

ఆలయం తొలగించాలని దౌర్జన్యం చేస్తున్నారు

ఆదివారాహి శక్తి టెంపుల్ ఉపాసకులు మహారుద్రస్వామి

తిరుపతి(కపిలతీర్థం), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రెవెన్యూ పరిధిలోని నది పరీవాహక ప్రదేశంలో ఐదేళ్ల క్రితం నిర్మించిన ఆదివారాహి ఆలయాన్ని తొలగించాలంటూ పలువురు దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారని ఆలయ ఉపాసకులు మహారుద్రస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ ఆలయ స్థల విషయమై హైకోర్టులో 14662/2024 నంబరుతో కేసు వేయగా ఆలయానికి అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. టెంపుల్ ట్రస్టు ద్వారా కింది కోర్టులో కేసు వేసి, నోటీసులు ఇస్తే ఇంతవరకు కోర్టుకు రాకుండా, నోటీసులకు సమాధానం ఇవ్వకుండా దౌర్జన్యాలు చేస్తున్నారన్నారు. ఆలయానికి విద్యుత్ మీటరు మంజూరై ఏడునెలలు కావస్తున్నా ఏర్పాటుకు అడ్డుగా నిలుస్తున్నారని తెలిపారు. సనాతన ధర్మవాదులు, హిందూమత విశ్వాసకులు స్పందించి ఈ దౌర్జన్యాలను అడ్డుకోవాలని కోరారు. సమావేశంలో టెంపుల్ ట్రస్ట్ సభ్యులు మధుసూదన్ రాజు, శ్రీరంగం, సంఘమిత్ర, నాగలక్ష్మి, ఆంజనేయులు పాల్గొన్నారు.

'మా భూమిని కాపాడండి'

తిరుపతి(లీలామహల్), ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం కొత్తపాలెం గ్రామ లెక్కదాఖలా సర్వే నెంబరు 104/1ఏ, 104/5ఏలలో తమకు చెందిన 3.86 ఎకరాల భూమిని కొందరు కబ్జా చేస్తున్నారని, కాపాడాలని చంద్రగిరికి చెందిన భాగ్యలక్ష్మి కోరారు. శుక్రవారం ఆమె ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ 2002లో రెవెన్యూ అధికారులు పట్టా ఇవ్వడంతో తామే ఆ భూమిని అనుభవిస్తున్నామన్నారు. 2007లో పాసుపుస్తకం ఇచ్చారని, ప్రస్తుతం ఆ భూమిని ఆనాదీనం కింద చూపడంతో హైకోర్టులో కేసు వేయగా స్టేటస్‌కో ఆర్డర్ వచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుతం తిరుపతికి చెందిన కొందరు ఆ భూమిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. రేణిగుంట తహసీల్దార్‌కు, పోలీసు, రెవెన్యూ అధికారులను సంప్రదించినా న్యాయం చేయలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి భూమిని కాపాడాలని కోరారు. సమావేశంలో చంద్రశేఖర్, శంకరయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

తిరుపతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం శ్రీనివాసం, పెద్దకాపు లేఔట్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను, రెండో వార్డులో గల సచివాలయాలను, చేపల మార్కెట్ ఏర్పాటు చేసేందుకు స్థలపరిశీలన చేశారు. సచివాలయాల పరిధిలో చేయాల్సిన అన్ని సర్వేలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కమిషనర్ వెంట ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, డీసీ అమరయ్య, ఎస్‌ఈ శ్యాంసుందర్, ఎంఈ తులసి కుమార్, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.లు రమణ, రాజు, ఆర్వో రవి, ఏసీపీ బాలాజి, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి ఉన్నారు.

స్మార్ట్ సిటీ పెండింగ్ పనులు పూర్తి చేయండి

తిరుపతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ సిటీ నిధులతో తిరుపతి నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను, ప్రాజెక్టుల ప్రతినిధులను ఆదేశించారు. ప్రాజెక్టుల ప్రతినిధులు, అధికారులతో శుక్రవారం ఆమె సమీక్షించారు. మౌర్య మాట్లాడుతూ పెండింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్లు చంద్రశేఖర్, శ్యాంసుందర్, డీఈలు రాజు, మహేష్, మధు, ప్రసాద్, ఏవో రాజశేఖర్, సీఏఫ్‌వో మల్లికార్జున, ఎయికాం ప్రతినిధులు బాలాజి, అనిల్, అఫ్కాన్స్ మేనేజర్ రంగస్వామి పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు

తిరుపతి, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి) : కొత్తగా ఎన్నికైన డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కూటమి కార్పొరేటర్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీవారి తీర్థప్రసాదాలు అందించారు. డిప్యూటీ మేయర్‌కు కమిషనర్ శుభాకాంక్షలు తెలిపారు.

యాత్రికులతో సత్ప్రవర్తనతో మెలగాలి



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీలత

తిరుపతి (నేరవిభాగం), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల పట్ల సత్ప్రవర్తనతో మెలిగి మంచిపేరు తెచ్చుకోవాలని నగర డీఎస్పీ శ్రీలత ఆటోడ్రైవర్లకు సూచించారు. నగరంలోని ఓ హోటల్లో ఆటోడ్రైవర్లు, యజమానులు, యూనియన్ నాయకులకు శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రధానంగా బస్టాండు, రైల్వే స్టేషన్లలో ఫిర్యాదులు రాకుండా మానవతా దృక్పథంతో పనిచేయాలని సూచించారు. భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాలను పార్కింగ్ చేయాలన్నారు. సమావేశంలో సీఐ నరసింహారావు, ఎస్‌ఐలు ఏ బాలకృష్ణ, హేమాద్రి, మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఐదవ రోజుకు వెటర్నరీ విద్యార్థుల సమ్మె

వెటర్నరీ లోగో ఆకారంలో వినూత్న నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

తిరుపతి రూరల్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా ఉపకార వేతనం(స్టైఫండ్) పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన సమ్మె ఐదవ రోజు శుక్రవారమూ కొనసాగింది. కళాశాల క్రీడా మైదానంలో వెటర్నరీ వైద్యులకు సంబంధించిన లోగో ఆకారంలో కూర్చుని నిరసన తెలిపారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మలను కలసి తమకు న్యాయం జరిగేలా చూడాలని వినతిపత్రం సమర్పించారు. సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేశ్‌బాబు, అచ్చెన్నాయుడులకు మెయిల్ ద్వారా వినతి పంపామని పేర్కొన్నారు. శుక్రవారం నుంచి రిలే నిరాహార దీక్ష ప్రారంభించామని, ప్రభుత్వం నుంచి జీవో వచ్చే వరకు సమ్మె విరమించబోమని స్పష్టం చేశారు.

మీ అరాచకాలు భరించలేకే వచ్చేశారు

వైసీపీ కార్పొరేటర్లు స్వతంత్రంగా ఓట్లేశారు

డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ

తిరుపతి(లీలామహల్), ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): 'మీ దౌర్జన్యాలు, అరాచకాలకు ఇమడలేకే వైసీపీ కార్పొరేటర్లు స్వతంత్రంగా వచ్చి ఓట్లు వేశారు. డిప్యూటీ మేయర్ పదవిని టీడీపీకి అందించారు' అని భూమనను ఉద్దేశించి డిప్యూటీ మేయరుగా కొత్తగా ఎన్నికైన ఆర్‌సీ మునికృష్ణ అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాము ఎవరినీ బెదిరించలేదని, బుజ్జగించలేదన్నారు. బలవంతపు ఎన్నికా కాదనే విషయాన్ని గుర్తించాలన్నారు. గత ఐదేళ్లలో కక్షసాధింపే లక్ష్యంగా పాలన సాగించడంతోనే ప్రస్తుతం వైసీపీ కార్పొరేటర్లు టీడీపీకి మద్దతుగా నిలిచారన్నారు. వైసీపీ శిబిరం నుంచి వచ్చిన మహిళా కార్పొరేటర్ కూడా టీడీపీకి మద్దతు తెలిపారని గుర్తుచేశారు. ఎన్నిక జరిగిన ఉదయమే 20 మంది రౌడీలను పంపి బెదిరించడాన్ని తిరుపతి ప్రజలు చూశారన్నారు. గత మున్సిపల్ ఎన్నికలు ఎంత అరాచకంగా జరిగాయో ఫ్లాష్‌బ్యాక్‌కు వెళ్లి గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. కౌన్సిల్‌లో 49కి గానూ 48 మందిలో నేను ఒక్కడిగా నిలవలేదా? వ్యక్తిగతం వేరు, రాజకీయం వేరుగా ఉండాలి. ముబ్బుడే వనారాయణరెడ్డి ఇంటి వద్ద రాత్రి సమయంలో డ్రోన్ ఎగురవేసి భయభ్రాంతులకు గురి చేయడం సరికాదు. ఇన్ని చేసి తిరుపతిలో వైసీపీ నాయకులు ప్రశాంతత గురించి మాట్లాడటం ఆశ్చర్యంగా ఉంది' అని మునికృష్ణ అన్నారు. ఈ సమావేశంలో శ్రీధర్, జగన్నాథం, శ్రీనివాసయాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, బాలాజీ, మణినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పవన్‌ను విమర్శిస్తే ఊరుకోం

జనసేన నగర కార్యదర్శి రాజేష్ ఆచారి

తిరుపతి(లీలామహల్), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థాయి లేని వ్యక్తులు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను విమర్శిస్తే చూస్తూ ఊరుకునేది లేదని జనసేన నగర ప్రధాన కార్యదర్శి రాజేష్ ఆచారి హెచ్చరించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ డబ్బుకు ఆశపడి పార్టీలు మారుతూ మోసాలు, అక్రమాలు నిత్యకృత్యంగా చేసుకున్న వ్యక్తులపై ఎస్పీకి ఫిర్యాదు చేయబోతున్నామన్నారు. ఉనికి కోసం పవన్‌పై విమర్శలు చేయడం మానుకోవాలని హితవుపలికారు. సమావేశంలో కాశర్ల హేమంత్, గల్లా ఆది, సుధాకర్ పాల్గొన్నారు.

పుస్తక వైభవం

రేపటితో ముగియనున్న 17వ తిరుపతి పుస్తక ప్రదర్శన

ఆకట్టుకుంటున్న సంగీత, సాహిత్య కార్యక్రమాలు





తిరుపతి (విశ్వవిద్యాలయాలు) ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పుస్తకానికి మంచి వైభవం వచ్చిందన్నట్టుగా 17వ తిరుపతి పుస్తక ప్రాంగణం కనిపిస్తోంది. వారం రోజులకు పైగా సాగిన ఈ ప్రదర్శన ఆదివారం ముగియనుంది. దీంతో సందర్శకుల తాకిడి పెరిగింది. అన్ని పుస్తక విక్రయ కేంద్రాల్లో ఆసక్తిగా పుస్తకాలు పరిశీలించి పెద్ద సంఖ్యలో కొనుగోలు చేస్తున్నారు. పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో చేపట్టిన సంగీత కార్యక్రమాలు సందర్శకులను అలరిస్తున్నాయి. కార్యక్రమంలో భారతీయ విద్యా భవన్ డైరెక్టర్, పుస్తక ప్రదర్శన నిర్వాహకులు డాక్టర్ సత్యనారాయణరాజు, సాహిత్య, పుస్తకాభిమానులు పాల్గొన్నారు.

పుస్తక ప్రపంచం

విజయవాణి ప్రింటర్స్



ఒక మారుమూల పల్లెలో ఇంత పెద్ద ప్రింటింగ్ పరిశ్రమా అని ఆశ్చర్యపోతారు చౌడేపల్లిలోని విజయవాణి ప్రింటర్స్‌ను చూసినవారంతా. అచ్చు వ్యాపారానికే వారు పరిమితం కాలేదు. ప్రచురణల రంగంలోనూ తెలుగు సాహిత్యంలో గౌరవనీయమైన స్థానం సంపాదించుకున్నారు. ప్రసిద్ధ రచయిత దివంగత నాయిని కృష్ణమూర్తి, ఆయన సోదరులు గురుశేఖరమూర్తి, చంద్రశేఖరమూర్తి, సుధాకరమూర్తి కలసి దీనిని ప్రారంభించారు. ఒక నిశబ్ద విప్లవంలా వేలాది పుస్తకాలను ప్రచురించారు. వీరు నడిపిన మాసపత్రికలు మా బడి, పాఠశాల ఒకప్పుడు అత్యంత పాఠకాదరణ పొందాయి. పాఠ్య పుస్తకాలు కూడా వేల సంఖ్యలో ప్రచురించారు. పిల్లల బొమ్మల కథల పుస్తకాలు వందలాదిగా ప్రచురించారు. నిఘంటువుల ప్రచురణలో కొత్త మార్గాన్ని చూపించారు. నాయిని కృష్ణమూర్తి రాసిన రామాయణం, జయం (మహాభారతం)తో పాటు అనేక రచనలు, మధురాంతకం నరేంద్ర రాసిన నాలుగుకాళ్ల మండపం, నిశ్శబ్దపు చప్పుడు, అడవిరాత్రి కథా సంపుటాలు, చిత్రకారులు జయదేవ్, అన్వర్‌ల పుస్తకాలు, వి.రాజారామమోహన్ రావు, వేమూరి సత్యనారాయణల పుస్తకాలు వీరిస్టాల్ నెంబర్ 47లో లభిస్తున్నాయి.

● పాఠక స్వరం

'అమ్మ డైరీలో కొన్ని పేజీలు' పుస్తకం కోసం వచ్చా



బుక్ ఫెయిర్‌లో చాలా పుస్తకాలు ఉన్నాయి. తెలుగు పుస్తకాలంటే ఇష్టం. ప్రత్యేకించి 'అమ్మ డైరీలో కొన్ని పేజీలు' పుస్తకం కొందామని వచ్చాను. ఈ పుస్తకం కొన్నాను. సంతోషంగా అనిపిస్తూ ఉంది.

– టి.ఆశ్రిత, బీటెక్ విద్యార్థిని, తిరుపతి

నవలలు చదవాలని ఉంది



పుస్తకాలు చదివే అలవాటు ఉంది. క్లాసు పుస్తకాలతో పాటు మిగతా పుస్తకాలు కూడా చదువుతూ ఉంటాను. నవలలు అంటే ఇష్టం. ఈ బుక్ ఫెయిర్‌లో మంచి నవలల కోసం వెతుకుతున్నాను.

– పి.వర్షిత్, ఎంబీబీఎస్ విద్యార్థి, ఎస్వీ మెడికల్ కాలేజీ

నేనేం చదువుతున్నానంటే..



1989లో తిరుపతిలోని టీపీపీఎం స్కూల్‌లో పదవ తరగతి ఫెయిల్ అయ్యాను. ఏం చేయాలో అర్థం కాలేదు. ఏడుపు దానంతట అదే వస్తోంది. ఇంటికెళితే ఏమంటారో అని భయమేసింది. లైబ్రరీకి వెళ్లి కూర్చున్నాను. చుట్టూ చూస్తే ఎవరిపాటికి వారు మౌనంగా చదువుతున్నారు. కన్నీళ్లు ఎవరికీ కనిపించకుండా ఉండేలా చదువుతున్నట్లు నటిస్తూ ఒక పుస్తకం ముఖానికి అడ్డుపెట్టుకున్నాను. ఆ పుస్తకం డాక్టర్ కేశవరెడ్డి రాసిన చివరిగుడిసె నవల. ఆ తర్వాత దానిని చదవడం మొదలుపెట్టాను. దీనివల్ల నాలోని భయం తొలగింది. జీవితమంటే ఏమిటో కొంత అర్థమై ధైర్యం వచ్చింది. ఆనాడు నాకు స్థైర్యం ఇచ్చిన ఆ నవలను ఇప్పుడు మళ్లీ చదువుతూ ఉంటే అప్పటి అనుభూతే కలుగుతూ ఉంది.

– పేరూరు బాలసుబ్రమణ్యం, రచయిత

మన పుస్తకం

మేకల బండ



మేకల బండ అనే ఈ నవలను ఆర్.సి.కృష్ణస్వామిరాజు రాశారు. ఆయన రాసిన ఈ తొలి నవలకు అంపశయ్య నవీన్ పురస్కారం కూడా వచ్చింది. నల్లగొర్రె, కుంటిమేక, మేకపోతు, పొట్టేలు ఈ నవలలోని పాత్రలు. మూగజీవాలైన వీటికి మనుషుల్లాగా ఆలోచించే శక్తి ఉంటే స్వార్థం, అసూయ, ద్వేషం, వివక్ష, దోపిడి స్వభావం వచ్చి ఉండేదనే సునిశిత వ్యంగ్యంతో ఈ నవలను సృజించారు. సహజమైన భాష, శైలి, స్థానిక మాండలికంలో రాయడం ఈ నవల ప్రత్యేకత. 118పేజీల ఈ నవల ధర రూ.100. తిరుపతి జిల్లా రచయితల సంఘం స్టాల్ నెంబరు- 56లో ఈ పుస్తకం ఉంది.

అలరించిన సంగీత కచేరి



తిరుపతి పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో చేపట్టిన సంగీత కచేరి అందరినీ ఆకట్టుకుంది. భారతీయ విద్యా భవన్ 8, 9 తరగతి విద్యార్థులు ఈ కచేరి చేపట్టారు. విద్యార్థులు సంయుక్త కృష్ణ, మేఘశ్రీ, తనుశ్రీ, వేణుశ్రీ ఈ ప్రదర్శన నిర్వహించారు. త్యాగయ్య, శ్రీరామదాసు, అన్నమయ్య, పురందరదాసు సంకీర్తనలను ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఎస్వీయూ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ ప్రొఫెసర్ దామోదరం



దామోదరాన్ని సత్కరిస్తున్న నిర్వాహకులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎస్వీ యూనివర్సిటీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ ప్రొఫెసర్ దామోదరం పేర్కొన్నారు. పుస్తక ప్రదర్శనలో భాగంగా శుక్రవారం సాయంత్రం చేపట్టిన పర్యావరణ పరిరక్షణ సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తి స్థాయిలో తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. పెట్రోల్, డీజిల్ స్థానంలో విద్యుత్, సోలార్ శక్తిని ఉపయోగించుకోవడం కూడా ఒక ప్రత్యామ్నాయమని అభిప్రాయపడ్డారు. పుస్తకాల ద్వారా పర్యావరణ పరిరక్షణపై సామాన్య ప్రజల్లో చైతన్యాన్ని తీసుకురావాలని కోరారు. స్విమ్స్ డీన్ డాక్టర్ అల్లాడి మోహన్ మాట్లాడుతూ వృక్షాలను సంరక్షించుకుని, ప్లాస్టిక్ వినియోగం తగ్గిస్తే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో భారతీయ విద్యా భవన్ డైరెక్టర్ సత్యనారాయణరాజు, ఆచార్య దక్షిణామూర్తి శర్మ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..

ఉప సర్పంచ్, ఎంపీటీసీ, పలువురు వార్డు సభ్యుల చేరిక



టీడీపీలోకి చేరిన ఉప సర్పంచ్ కవిత రాజగోపాల్, ఎంపీటీసీ దాసవాణి, వార్డుసభ్యులతో ఎమ్మెల్యే నాని

తిరుపతిరూరల్,ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం అవిలాల పంచాయతీలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఉపసర్పంచ్ పయ్యావుల కవిత రాజగోపాల్, ఎంపీటీసీ-1 దాసవాణి శ్రీనివాసులు, పలువురు వార్డు సభ్యులతో పాటు దాదాపు 100మంది కార్యకర్తలు వైసీపీని వీడి శుక్రవారం ఎమ్మెల్యే పులివర్తి నానీ సమక్షంలో పసుపు కండువాలు కప్పుకున్నారు. పాత పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో కవిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీలో చేరామని చెప్పారు. రాజగోపాల్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తక్కువ కాలంలో పార్టీలకతీతంగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. టీడీపీ నేత కురకాల్వ సుధాకర్ మాట్లాడుతూ గ్రామంలో పూర్వం టీడీపీ అంటే పయ్యావుల గురునాథమని, ఆయన కుమారుడు, కోడళ్లు తిరిగి పార్టీలో చేరడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు సాంబశివయ్య, యు.మునిశేఖర్ రాయల్, ముని, కృష్ణమూర్తిరెడ్డి, మధు, శ్రీధర్‌నాయుడు, బాబురాయల్, బీజీకృష్ణాయాదవ్ పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనకు ప్రణాళికలు ఆచరించండి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): భవానీనగర్‌లోని గీతం స్కూల్ 13వ వార్షికోత్సవాన్ని శుక్రవారం మహతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి లక్ష్యాలను నిర్దేశించుకుని సాధనకు ప్రణాళికలు ఆచరించాలని సూచించారు. వివిధ అంశాలు, క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జిల్లా రవాణాశాఖ అధికారి మురళీమోహన్, చైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు, చైర్‌పర్సన్ పాలడుగు విజయ, ప్రిన్సిపాల్ కిన్నెర శ్రీదేవి, లిటిల్ ఏంజిల్స్ స్కూల్ చైర్‌పర్సన్ ఎం.రమాదేవి పాల్గొన్నారు.

ఎయిమ్ ఫర్ ఎక్సలెన్స్ ప్రోగ్రామ్ ప్రారంభం



వివరాలు వెల్లడిస్తున్న ఆకాష్ విద్యాసంస్థ ప్రతినిధులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నీట్, జేఈఈలలో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కార్యక్రమం ఎయిమ్ ఫర్ ఎక్సలెన్స్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్, అసిస్టెంట్ సేల్స్ హెడ్ మోడెం నరసింహులు తెలిపారు. తిరుపతిలోని ఆకాష్ ఇన్‌స్టిట్యూట్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు వివరాలను వెల్లడించారు. నీట్, జేఈఈ వంటి పోటీ పరీక్షలతో పాటు ఒలంపియాడ్, ఇతర జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో విద్యార్థులు నూటికి నూరు శాతం విజేతలుగా నిలిపేందుకు తాము రూపొందించిన ఈప్రాజెక్ట్ ఎంతో దోహదపడుతుందన్నారు. అకడమిక్ హెడ్లు రామా రమేష్, రఘురాం, పవన్ కుమార్, అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ సాయిరాజ్ కుమార్, ఏవో చిరంజీవి పాల్గొన్నారు.

కిల్‌గేమ్ స్టార్స్ షార్ట్ సినిమా షూటింగ్ ప్రారంభం



తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానికంగా ఉన్న ఒక హోటల్లో కిల్ గేమ్ స్టార్స్‌షార్ట్ చిత్రం షూటింగ్ శుక్రవారం ప్రారంభమైంది. చిత్ర నిర్మాత షీలా లోకనాథ్, సాయికళ ఫౌండేషన్ చైర్మన్ మధుసూదన్, లైక్వాండో జిల్లా అధ్యక్షుడు ధనంజయలు క్లాప్ కొట్టారు. నిర్మాత మాట్లాడుతూ మహిళా సాధికారిత గురించి, వారిని చైతన్యపరచడానికి, అత్యవసర పరిస్థితుల్లో వారి పోరాట పటిమను మేల్కొలిపే స్ఫూర్తితో తీస్తున్నామన్నారు.

హెల్మెట్ లేకుంటే నో ఎంట్రీ

● కార్మికులకు నిప్పో పరిశ్రమ నిబంధన



హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపే కార్మికులను విధుల్లోకి అనుమతించబోమని తడ మండలంలోని నిప్పో పరిశ్రమ యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ మేరకు పరిశ్రమ ప్రధాన గేటు వద్ద నోటీసులు అంటించింది. రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా మృత్యువాత పడుతున్న నేపథ్యంలో కార్మికుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని యాజమాన్యం పేర్కొంది. ద్విచక్ర వాహనాలు నడిపే కార్మికులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించింది.

- తడ, ఆంధ్రజ్యోతి

నైమిశారణ్యంలో వైభవంగా
శ్రీవారి కల్యాణం, చక్రస్నానం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుమల, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళా సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని నైమిశారణ్యంలోని బాలాజీ ఆలయంలో శుక్ర వారం ఉదయం శ్రీనివాస కల్యాణాన్ని టీటీడీ వైభవంగా నిర్వహించింది. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణశేషాచల దీక్షితులు ఆధ్వర్యంలో అర్చకబృందం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారిని కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కంకణధారణ, అగ్నిప్రతిష్ఠాపన, యజమాని సంకల్పం, భక్తసంకల్పం, మహా సంకల్పం, మాంగళ్యపూజ, మంగళ సూత్రధారణ వంటి ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అలాగే, గోమతి నదీ తీరంలో శుక్రవారం చక్రస్నానాన్ని నిర్వహించారు. నదీతీరంలో చక్రత్తాళ్వార్లకు పాలు, పెరుగు, తేనె, చందనంతో అర్చకులు అభిషేకం చేశారు.

శ్రీహరి సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లోని 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.23 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,908

తలనీలాలు సమర్పించినవారు: 19,549

తిరుపతి డిప్యూటీ మేయర్‌గా ఆర్సీ మునికృష్ణ ఎన్నిక వైసీపీ రాజకీయ నైజాన్ని ఎరిగిన అందరినీ ఆశ్చర్య చకితులను చేసింది. దబాయింపులకు తగ్గకుండా, బెదిరింపులకు లొంగకుండా వైసీపీ జెండాతో కార్పొరేటర్లుగా గెలిచిన ఇంత మందిని ఎలా కూడగట్టగలిగారన్నదే చర్చగా మారింది. 'రాష్ట్రంలో అధికారం మనదైనా.. తిరుపతి కార్పొరేషన్‌లో అంతా వాళ్లే.. అబ్బే.. అసాధ్యం' అనుకుంటున్న సమయంలో ట్రబుల్ షూటర్స్ రంగంలోకి దిగారు. వ్యూహ నైపుణ్యాలను వెలికి తీశారు. గెలిపించి .. వైసీపీని దడిపించి చూపించారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



కూటమిలో ట్రబుల్ షూటర్స్

తెరవెనుక ఎన్వీ ప్రసాద్

తిరుపతి డిప్యూటీ మేయర్‌ను టీడీపీకి టర్న్ చేయడంలో ప్రధాన వ్యూహకర్త తుడా మాజీ ఛైర్మన్ ఎన్వీ ప్రసాద్. తెరవెనుక నుంచే కథ మొత్తం నడిపారు. తన ప్రధాన అనుచరుడు ఆర్సీ మునికృష్ణను డిప్యూటీ పీఠంపై కూర్చొబెట్టారు. ఎన్వీ ప్రసాద్ ఎన్నికల స్ట్రాటజీపై స్థానిక రాజకీయనాయకులు ప్రత్యేకంగా చెప్పుకుంటుంటారు. తన సినిమాను బ్లాక్‌బస్టర్ చేసేందుకు ఎంత శ్రమిస్తారో, ఎన్నిక క్రతువును తనవైపు తిప్పుకునేందుకు అంతే కష్టపడతారన్న పేరుంది. డిప్యూటీ మేయర్ ఎన్నిక నోటిఫికేషన్ వచ్చినప్పటినుంచి ఆయన సినిమా థియేటర్‌లోని తన ఆఫీస్‌కే పరిమితమైపోయినట్టు కనిపించినా అక్కడి నుంచే చక్రం తిప్పారు. ఆయనకు మరో ముఖ్య అనుచరుడు కార్పొరేటర్ నరసింహాచారి, యువ కార్పొరేటర్ నరేంద్రనాథ్‌ల శ్రమా, సహకారం కీలకమైనవి. కూటమివైపు నిలబడే వారి సంఖ్యను మూడు నెలల క్రితమే ఆ సంఖ్యను 16కు చేర్చారు. వైసీపీ స్థానిక నాయకత్వంపై ఉన్న అసంతృప్తిని కూటమికి అనుకూలంగా మార్చుకోవడంల ఎన్వీ ప్రసాద్ పాత్ర ప్రత్యేకమైనదిగా కూటమి శ్రేణులు చెప్పుకుంటున్నారు.

యూత్ పవర్.. జేబీ

బయట ఎక్కడా కనిపించకపోయినా డిప్యూటీ మేయర్‌గా టీడీపీ ఒకే ఒక్కడు ఆర్సీ మునికృష్ణను గెలిపించుకోవడంలో కీలక పాత్ర పోషించారు జేబీ. రియల్‌ఎస్టేట్ రంగంలో ఉన్న జేబీ శ్రీనివాస్. రాజకీయాల్లోనూ సమాంతరంగా ప్రయాణిస్తున్నారు. ఎటువంటి పరిస్థితుల్లో అయినా ఆయనను వెన్నంటి ఉండే యూత్ జేబీ బలం. క్లిష్ట పరిస్థితుల్లోనూ అనాయాసంగా పనిని చక్కదిద్దగల సామర్థ్యం ఆయనది. దివంగత ఎమ్మెల్యే వెంకటరమణ టీడీపీలోకి వచ్చిన తర్వాత ఎన్నికల సమయంలో ఆయనకు అండగా యూత్ ఫోర్స్‌ను దించేవాడు. ప్రత్యర్థి పార్టీలకు దీటుగా నిలబడి వ్యూహాలు రచించడంలోనూ, పోల్ మేనేజ్‌మెంట్ చేయడంలోనూ గట్టి పట్టుంది. 2019 ఎన్నికల్లో కొర్లగుంట, జీవకోన ప్రాంతాల్లో టీడీపీకి జనరల్ ఏజెంట్‌గా పనిచేసిన జేబీ వర్గం వైసీపీ దౌర్జన్యాలను నిలువరించగలిగింది. ఈ బూత్‌ల్లో వైసీపీకి మెజారిటీ తగ్గిపోవడంతో ఆ తర్వాత అక్రమ కేసుల్లో ఇరికించారు. తిరుపతి అసెంబ్లీ టికెట్ ఆశించినవారిలో జేబీ కూడా ఉన్నారు. వైసీపీ పట్ల అసంతృప్తితో ఉన్న కార్పొరేటర్లను కూటమివైపునకు మళ్లించడంలో ఈయన పాత్ర చాలానే ఉంది. జేబీ యూత్ ఫోర్స్ బలమేమిటో నిరూపించారు.

'పెదబ్బ' దెబ్బకు పెడబొబ్బ

తిరుపతి రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన కుటుంబం ప్రతినిధిగా మబ్బు దేవనారాయణరెడ్డి (పెదబ్బ)కి ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. వెరపు ఎరగని నైజం ఆయనది. ముఖాన నవ్వు చెరగకుండానే పరిస్థితులను అదుపులోకి తెచ్చుకోగల చాతుర్యం ఆయన సొంతం. మున్సిపల్ ఛైర్మన్‌గా, ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమి చెందినా మబ్బు పెదబ్బ పేరు నగరంలో మోగుతూనే ఉంటుంది. మబ్బు యువసేన పేరుతో పెద్ద బలగమే ఉంది. తిరుపతి స్థానికుల్లో ఆయనకున్న స్నేహ, బంధుత్వాలే ఆయన బలం. తిరుపతిలో వైసీపీ పై అంటే.. పై అనగల దమ్మున్న నాయకుడిగా గుర్తింపు ఉంది. 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన పెదబ్బ గత ఎన్నికల్లో తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో కూటమి విజయానికి మనసుపెట్టి పనిచేశారు. తాజాగా తిరుపతిలో జరిగిన డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో ఆచితూచి అడుగులేస్తూ వైసీపీకి దాటిగానే సమాధానం ఇచ్చారు.

రవినాయుడు లాస్ట్ పంచ్

నిన్నమొన్నటి దాకా చేతిలో పుస్తకంతో యూనివర్సిటీలో కనిపించిన ఇతనేనా అని అందరూ ఆశ్చర్యపోతున్నారు అనిమిని రవినాయుడును చూసి ఇప్పుడు. రాష్ట్ర సమస్యల మీద మీడియాలో స్పందించే విద్యార్థి నాయకుడిగా మొదలైన రవినాయుడి రాజకీయ జీవితం లోకేశ్ పాదయాత్రతో కీలక మలుపు తీసుకుంది. కుప్పం నుంచి నెల్లిమర్ల దాకా యువగళానికి రక్షా కవచంలా యువసైన్యాన్ని నడిపించిన సారథిగా గుర్తింపు తెచ్చుకున్నారు. నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి', హలో లోకేశ్.. సభల నిర్వహణ బాధ్యతను సమర్థంగా నిర్వహించారు. సీనియర్లున్నా శాప్‌ఛైర్మన్ పదవి వరించి వచ్చింది ఈ కారణాలవల్లే. తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికలో ఆఖరి రోజున ఆయన అనుసరించిన వ్యూహ నైపుణ్యాలు వైసీపీ అంచనాలకు అందలేదు. చాపకిందనీ అంతా చక్కబెట్టేశారు.

'అన్నా' లెక్కలే వేరు

జీవకోన అనగానే అన్నా పేరు వినిపిస్తుంది. అధికారంలో ఎవరున్నా ఆ ప్రాంతం మీద పట్టు మాత్రం అన్నా రామచంద్రయ్యదే అన్నంతగా జీవ కోనతో పెనవేసుకుపోయారు. తన వారసురాలిగా కుమార్తె అన్నా అనితను కార్పొరేటర్‌గా గెలిపించు కున్నారు. వైసీపీలో తీవ్ర అనాదరణకు గురైన ఆయన ఆ తర్వాత అదను చూసి అడుగులు కదిపారు. కుమార్తె అన్నా అనితను మేయర్ పీఠంపై కూర్చోబెట్టాలనే లక్ష్యం పెట్టుకున్నారు. డిప్యూటీ మేయర్ ఎన్నికలో అన్నా సత్తా ఏమిటో చూపించారు. జాతీయ రాజకీయ పరిణామాలూ.. బీసీలకు జరుగుతున్న అన్యాయం పై అనర్గళంగా మాట్లాడ గలగడం ఆయన బలం. యాదవసామాజికవర్గంలో పట్టున్న నాయకుడు. వ్యయ ప్రయాసలకు వెనుదీయకుండా డిప్యూటీ ఎన్నికలో కృషి చేశారు.

తీరు సైతం...

డిప్యూటీ మేయర్ ఎన్నిక టీడీపీ వశం కావడానికి ట్రబుల్ షూటర్స్‌కు సమన్వయంగా మరికొంతమంది సహకరించారు. ముఖ్యంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కుమారుడు ఆరణి మదన్, ఎమ్మెల్యే వాయిస్‌గా మదన్ అన్ని సందర్భాల్లోనూ చకచకా నిర్ణయాలు తీసుకుంటూ చురుగ్గా వ్యవహరించారు. కార్పొరేటర్లను శిబిరాలకు తరలించడం, వారి యోగక్షేమాల దాకా బాధ్యతగా చూసుకున్న మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్‌లు శ్రమను కూటమి నాయకత్వం ప్రశంసిస్తోంది.

బదిలీ చేసినా కదలరంతే!

● సదరన్ డిస్కం విద్యుత్ సర్కిల్‌లో ఇదీ సంగతి

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బదిలీ ఉత్తర్వులు అందుకున్న వారం రోజుల్లోపు రిలీవ్ కావాలి. ఇదీ నిబంధన. కానీ సదరన్ డిస్కం పరిధిలో కొందరు దీనిని అతిక్రమిస్తున్నారు. గతేడాది సెప్టెంబరు 22వ తేదీన బదిలీ చేసినా.. ఇప్పటికీ రిలీవ్ కాలేదు. పాత స్థానాల్లోనే కొన సాగుతున్నారు. తిరుపతి విద్యుత్ సర్కిల్‌లోని ఆయా కార్యాలయాలతో పాటు ఆపరేషన్ విభాగంలో దీర్ఘకాలంగా ఉన్న వారిని గతేడాది సెప్టెం బరు 22న కార్పొరేట్ కార్యాలయ అధికారులు బదిలీ చేశారు. కొన్ని సంఘాల్లోని వారు ఎక్కువ మంది బదిలీ అయ్యారు. కొందరు మాత్రం పాత స్థానాల్లోనే కొనసాగుతూ.. డివిజన్, సర్కిల్ స్థాయి అధికారుల వద్దకు వెళ్లి తమను రిలీవ్ చేయకుండా చూడాలని కోరినట్లు సమాచారం. కొందరు అధికారులు నోటి మాటతో వీరి బదిలీని అడ్డుకుంటున్నారన్న విమర్శలు ఉద్యోగ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. అప్పటికప్పుడే కొందరిని రిలీవ్ చేసిన అధికారులు.. మిగతావారి విషయంలో చూసీచూడనట్లు ఉండటం గమనార్హం. ఇలా ఉమ్మడి జిల్లాలో బదిలీ ఉత్తర్వులు అందు కున్న వారిలో 10 మందికి పైగా మౌఖిక ఆదేశాలతో తిరుపతిలో కొందరు, శ్రీకాళహస్తిలో బదిలీ ఆర్డరు తీసున్న ఇద్దరు లైన్ ఇన్‌స్పెక్టర్లు రిలీవ్ కాకుండా కొనసాగుతున్నట్లు తెలిసింది. దీనిపై క్షేత్రస్థాయిలో ఏఈ లను వివరణ కోరగా.. ఉన్నత స్థాయి అధికారుల మౌఖిక ఆదేశాలు ఉన్నా యని చెబుతున్నారని చెప్పారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఈఈ చిన్నరెడ్డెప్పను విచారించగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. బదిలీ చేసినవారు రిలీవ్ కాలేదన్న విషయం తమ దృష్టికి వచ్చిందని సీజీఎం హెచ్‌ఆర్‌డీ రమణాదేవి తెలిపారు. ఆ విష యాన్ని సీఎండీతో చర్చించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మాతృభాషతోనే మానసిక వికాసం

● '30 రోజుల్లో తెలుగు రీడింగ్ ఛాలెంజ్' ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో కేవీఎన్ కుమార్

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మాతృభాషతోనే మానసిక వికాసం కలుగుతుందని, విద్య, విజ్ఞానం సమకూరుతుందని డీఈవో కేవీ ఎన్ కుమార్ తెలిపారు. జిల్లాకు సంబంధించి రెండు పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన '30 రోజుల్లో తెలుగు రీడింగ్ ఛాలెంజ్' కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. తిరుపతిలోని సంజయ్‌గాంధీ కాలనీ లోని మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన ప్రారంభ కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. మాతృభాషపై పట్టుసాధిస్తేనే ఇతర భాష ల్లోనూ ప్రావీణ్యం సాధించగలమన్నారు.అందుకే విద్యార్థులందరికీ తెలుగు ధారాళంగా చదవడం, మాట్లాడేలా తీర్చిదిద్దేందుకు 'తెలుగు రీడింగ్ ఛాలెంజ్' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమ నిర్వాహ కుడు భాస్కర్‌రాజు ఎడ్యుకేషనల్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ డైరె క్టర్ భాస్కర్‌రాజు మాట్లాడుతూ.. 30 రోజుల్లో ధారాళంగా చదవగలిగేలా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా ఓ ప్రోగ్రామ్‌ను రూపొందించి సత్ఫలితాలు సాధించినట్లు చెప్పారు. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో పైలెట్ ప్రాజె క్టుగా ప్రారంభం కావడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అనం తరం భాస్కర్‌రాజు రూపొందించిన తెలుగుభాష సంజీవిని పుస్తకాలను విద్యార్థులకు డీఈవో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఈవో బాలాజీ, డీఈవో కార్యాలయ ఐటీ సెల్ మానిటరింగ్ అధికారి ధనుంజ యులు నాయుడు, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు అనిల్‌కుమార్, తెలుగు ఉపాధ్యాయిని విజయకుమారి, ఇతర ఉపాధ్యాయులు, భాస్కర్‌రాజు ఎడ్యుకేషనల్ రీసెర్చ్ సెంటర్ ఇన్‌స్ట్రక్టర్ అశ్విని తదితరులు పాల్గొన్నారు.

ఓఎల్‌ఎక్స్‌లో పరిచయం

● ఉద్యోగం పేరిట అసభ్యకర చాటింగ్‌పై ఫిర్యాదు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఉద్యోగావకాశాలను చూస్తుండగా ఓఎల్‌ఎక్స్‌లో పరిచయమయ్యాడు. కార్యాలయం పెడతా మంటూ తిరుపతికి వచ్చాడు. ఆపై సినిమాకు, తిరుమలకు వెళ్దామంటూ ఆ మహిళను ఒత్తిడి చేశాడు. ఈ మేరకు బాధితురాలి భర్త శుక్రవారం అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలిపిరి ఎస్‌ఐ లోకేష్‌బాబు తెలి పిన ప్రకారం.. తిరుపతి నగరం కొర్లగుంటకు ఓ వివాహిత ఉద్యోగాన్వేష ణలో ఉన్నారు. ఓఎల్‌ఎక్స్‌లో సెర్చ్ చేస్తుండగా హైదరాబాదుకు చెందిన సునీల్‌కుమార్ మొబైల్ నెంబరు అందులో కనిపించింది. ఉద్యోగం కోసం ఆమె అతడితో వాట్సాప్ ద్వారా చాటింగ్ ప్రారంభించారు. కొద్ది రోజుల క్రితం తిరుపతికి వచ్చిన సునీల్‌కుమార్.. ఇక్కడ ఓఎల్‌ఎక్స్ కార్యాలయం పెట్టేందుకు గది చూడాలని చెప్పాడు. ఇద్దరూ అద్దెకు గది కోసం వెదికారు. ఇటీవల హోటల్‌లో భోజనం చేశాక తిరుమలకు వెళ్దామని ఆమెను పిలి చాడు. ఆమె ససేమిరా అన్నారు. తాను లీలామహల్ వద్ద ఉన్నానని, సిని మాకు వెళ్దామంటూ ఆమెతో చాటింగ్ చేశాడు. అతడి వైఖరిని అనుమానిం చిన ఆమె భర్తకు విషయం చెప్పారు. వెంటనే వారు డయల్ 100కు ఫోను చేసి ఫిర్యాదు చేశారు. వీరిచ్చిన సమాచారం మేరకు సునీల్‌కుమార్‌ను అలి పిరి ఎస్‌ఐ లోకేష్‌బాబు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

18 నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

చంద్రగిరి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 18 నుంచి 26వ తేది వరకు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల బుక్‌లెట్లను టీటీడీ ఈవో శ్యామలారావు శుక్రవారం సాయంత్రం తిరుమలలోని ఈవో క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో 13న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుందన్నారు. 17వ తేది అంకురా ర్పణ, 18న ధ్వజారోహణం, రాత్రి పెద్దశేష వాహనం, 19న ఉదయం చిన్న శేష, రాత్రి హంస, 20న సింహ, ముత్యపు పందిరి, 21న కల్పవృక్ష, సర్వ భూపాల, 22న మోహినీ అవతారం, రాత్రి గరుడ సేవ, 23న హను మంతు, సాయంత్రం స్వర్ణ రథోత్సవం, రాత్రి గజ వాహనం, 24న సూర్య ప్రభ, రాత్రి చంద్రప్రభ, 25న రథోత్సవం, అశ్వవాహన సేవలు ఉంటా యని ఈవో వివరించారు. 26న ఉదయం చక్ర స్నానం, రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. ఈ కార్యక్ర మంలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, అర్చకులు పార్థసారథి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ ఈవో, అధికారులు

వైసీపీకి షాక్

● పార్టీకి జడ్పీటీసీ, ముగ్గురు ఎంపీటీసీలు, ఇద్దరు సర్పంచులు, కార్యకర్తల రాజీనామా

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 7 (ఆంధ్ర జ్యోతి): బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో వైసీ పీకి పెద్ద షాక్ తగిలింది. ఆ పార్టీ మండల కన్వీనర్ ఆరణి విద్యానాథరెడ్డిని పార్టీ నుంచి సస్పెండు చేశారు. ఆయనకు మద్దతుగా జడ్పీటీసీ సభ్యురాలు ఆరణి ప్రతిమ, ఆర్‌అనంతపురం, కాటూరు, ఆల త్తూరు ఎంపీటీసీ సభ్యులు పుట్టయ్య రవి, వరలక్ష్మి, వెస్ట్‌వరత్తూరు సర్పంచ్ దయా, బీఎన్‌కండ్రిగ సర్పం చ్ మునిరాజా, పలువురు కార్యకర్తలు వైసీపీకి రాజీ నామా చేశారు. ఈ మేరకు శుక్రవారం నీర్పాకోటలో ప్రకటించారు. మరికొందరు ఎంపీటీసీలు, సర్పం చులు, నాయకులు, కార్యకర్తలు కూడా రాజీనామా చేయనున్నారని జడ్పీటీసీ ప్రతిమ తెలిపారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో తమ సత్తా చాటుతామన్నారు. వైసీపీ మండల సచివాలయ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, నాయకులు గిరిరెడ్డి, మునస్వామి, భాస్కరయ్య తది తరులున్నారు.

మిస్ గ్లోబల్ ఆసియా విజేతకు సీఎం అభినందన

చంద్రగిరి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మలేషియాలో జరిగిన మిస్ గ్లోబల్ ఆసియా పోటీలలో విజేతగా నిలి చిన చంద్రగిరికి చెందిన భావనరెడ్డిని సీఎం చంద్రబా బునాయుడు అభినందించారు. విజేతగా నిలిచిన ఆమె తన తండ్రి గోపికృష్ణతో పాటు తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, టీడీపీ నాయకులు పులికంటి మోహన్‌రెడ్డి, ఆర్.బాలాజీ, ఆర్.ప్రవీణ్, కోటే శ్వరరావు, శేఖర్, బాషాతో పాటు సీఎం చంద్రబాబును కలిశారు. అంతర్జాతీయ వేదికపై చంద్రగిరి పేరును గట్టిగా వినిపించారంటూ సీఎం ఆమెను ప్రశంసిం చారు. మంత్రులు కొల్లు రవీంద్ర, రాంప్రసాద్‌రెడ్డిని కూడా వీరు కలిశారు.



భావనరెడ్డిని అభినందిస్తున్న సీఎం చంద్రబాబు

వ్యాపారంతో పాటు సమాజంపై బాధ్యతా ఉండాలి

● మందుల విక్రయదారుల అవగాహన సదస్సులో ఎస్పీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(వైద్యం),ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 'వయసుతో సంబంధం లేకుండా కొందరు పలు రకాల మత్తుకు బానిసలవుతున్నారు. నేరాలకు పాల్పడుతున్నారు. దీన్ని అరికట్టా లంటే మీ సహకారం అవసరం. వ్యాపారంతో పాటు సమాజంపై బాధ్యత కూడా ప్రధాన మనే విషయాన్ని మీరు దృష్టిలో పెట్టుకోవాలి' అని జిల్లాలోని ఔషధ విక్రయదారులకు ఎస్పీ హర్షవర్ధ న్‌రాజు సూచించారు. తిరుపతి నగరం కరకంబాడి రోడ్డులోని ఫ్యాబ్ భవనంలో డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగా హన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు. జిల్లాను డ్రగ్స్ రహితంగా మార్చేందుకు అందరి సహకారం అవసర మన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలతో పాటు కొందరు మందుల దుకాణాల్లో లభించే పలు మత్తు నిచ్చే ఔషధాలకు అలవాటు పడి ఆరోగ్యంతోపాటు జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. దీనిని అరికట్టాలంటే డాక్టర్ రశీదు లేకుండా మందులు విక్ర యించడం, చిన్నారులకు మందులు విక్రయించడం వంటివి చేయకూడదన్నారు. రోగులు నిజమైనవా, నకిలీవా అనేది చూసుకోవాలన్నారు. కొన్ని నిషేధిత మందులు, మత్తును ఇచ్చే మందుల విక్రయాల విష యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమించి మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రుయాస్పత్రి డీ అడిక్షన్ సెంటర్ మానసిక వైద్య నిపుణురాలు మానస మాట్లాడుతూ అనుభవంతో ఇచ్చే కొన్ని రకాల మందుల వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతినే అవకాశముందని తెలిపారు. డాక్టర్ సలహా లేకుండా మందులు ఇస్తే ఎలాంటి నష్టాలు ఉంటాయనే విషయాలను వివరించారు. ఈ కార్యక్ర మంలో ట్రైనీ ఎస్పీ హేమంత్, అదనపు ఎస్పీ రవిమ నోహరాచారి, డీఎస్పీ శ్రీలత, డీఐవోలు సుభాషిణి, రూతు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా మహాశివరాత్రి ఏర్పాట్లు



త్రినేత్ర అతిథి గృహం వద్ద రంగులు అద్దుతున్న కళాకారులు





స్వామి అమ్మవార్ల వాహనాలకు రంగులు అద్దుతున్న దృశ్యం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జంగమయ్య పండుగ మహాశివ రాత్రి వేడుకలకు శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగు తున్నాయి. ఈ నెల 21వ తేదీ నుంచి మార్చి 6వ తేదీ వరకు 14రోజుల పాటు అంగరంగ వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. 26న మహాశివరాత్రి, 27 ఉదయం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం, 28వ తేదీ అర్ధరాత్రి శివపార్వతుల కల్యాణం, మార్చి 2న గిరిప్రదక్షిణ, 4న పల్లకీ సేవ ఉత్సవాలు ప్రధాన ఘట్టాలు. ఆయా రోజుల్లో జరిగే ఉత్సవాలకు పెద్దఎత్తున భక్తుల రద్దీ ఉంటుంది. అందుకు అనుగుణంగా భక్తులు బస చేసేందుకు షెడ్లు, ఇతర సౌకర్యాలను సిద్ధం చేస్తున్నారు. ఆలయం లోపల గురువారం రంగురంగుల ముగ్గులు తీర్చిదిద్దారు. స్వామి అమ్మవార్ల వాహ నాలకు రంగులు అద్దుతున్నారు. అలాగే ధ్వజస్తంభం, మహద్వారం ప్రదే శాల్లో అద్దిన రంగులు భక్తులను ఆకట్టుకున్నాయి.

డాలర్ కేంద్రం డొల్లతనం

● పాడైన పైకప్పు, ఊడుతున్న గోడపెచ్చులు



తిరుమల, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): డాలర్ల విక్రయ కేంద్రం అస్తవ్య స్తంగా తయారైంది. పాడై పోయిన పైకప్పు, ఊడు తున్న గోడపెచ్చులతో ఆందోళన కలిగిస్తోంది. 40 ఏళ్లుగా టీటీడీ శ్రీనివా సుడు, పద్మావతి అమ్మవా ర్లుండే బంగారు, వెండి డాలర్లను విక్రయిస్తోంది. భక్తుల నుంచి మంచి స్పందన వస్తున్న క్రమంలో తొలుత బయోమెట్రిక్, తర్వాత లడ్డూకౌంటర్ల వద్దకు విక్ర యకేంద్రాన్ని మార్చారు. భక్తులకు అందుబాటులో ఉండేలా ఆరేళ్ల క్రితం శ్రీవారి ఆలయం ముందున్న పుస్తకవిక్రయశాల వద్ద విక్రయ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలోని ఈ కౌంటర్ ద్వారా రోజుకు రూ.10లక్షల నుంచి రూ.15 లక్షల వరకు విక్రయాలు జరుగుతాయి. పర్వదినాల్లో రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు విక్రయాలుంటాయి. అక్షయతృతీయ వంటి రోజుల్లో రూ.75 లక్షల వరకు అమ్మకాలు సాగుతాయి. ఇంత విలువైన కౌంటరు పైకప్పుతో పాటు గోడపె



పాడైపోయిన పైకప్పు, గోడలు

చ్చులు ఊడిపడుతున్నాయి. వర్షమొస్తే రేకుల నుంచినీరు కౌంటర్‌లోకి చేరుతోంది. సిబ్బంది ప్లాస్టిక్ బకెట్లు పెడుతున్నారు. కౌంటర్ వద్ద కనీస భద్రత లేదు. గేట్లకు గొళ్లాలు కూడా లేకపోవడంతో సిబ్బంది భయంభయంగా విధులు నిర్వహిస్తున్నారు. కాగా ఇటీవల వెండి, రాగి డాలర్ల కోసం వస్తున్న భక్తులు నోస్టాక్ బోర్డు చూసి నిరాశ చెందుతున్నారు.

ఘనంగా శుక్రవార ఉత్సవం



అమ్మవారి ప్రాకార ఉత్సవం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువు దీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కుటుంబ కలహాలతో దాడి



గాయపడిన రవి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో దాడిలో ఓ యువకుడు గాయపడ్డాడు. బాధితుని కథనం మేరకు .శ్రీకాళహస్తికి చెందిన రవి (35) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఇతని చెల్లెలు నాగమ్మకు కరకంబాడికి చెందిన ఆటోడ్రైవర్ గోపీతో వివాహమై నలుగురు పిల్లలున్నారు. కొంతకాలంగా భర్తతో విభేదాలు రావడంతో ఆమె శ్రీకాళహస్తిలోని అన్న ఇంటి వద్దకు వచ్చింది. ఇక్కడే కూలి పనులు చేసుకుంటూ జీవనం గడుపుతోంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి పట్టణంలోని ధర్మరాజులస్వామి ఆలయం వెనుక ఉన్న పిచ్చాటూరు రహదారిపై అన్నాచెల్లెలు అయిన రవి, నాగమ్మ నడచి వెళుతుండగా గోపి మరికొందరితో అక్కడికి చేరుకుని వారిని అడ్డగించాడు. ఈ క్రమంలో వాగ్వాదం జరిగి ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. గోపీ రాయితో కొట్టి దాడి చేయడంతో రవి తలకు గాయమైంది. చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చేరాడు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్రగాయాలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి (సుమారు45) తీవ్రంగా గాయపడ్డాడు. తొట్టంబేడు మండలం పొయ్య సమీపంలో ద్విచక్ర వాహనదారుడు అదుపు తప్పి రోడ్డు పక్కన పడిపోయాడు. అపస్మారక స్థితిలో ఉండటంతో స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు ప్రాణాపాయ స్థితిలో ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు.

సామాజిక కార్యకర్త మల్లీశ్వరికి డాక్టరేట్



పిచ్చాటూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు జడ్పీ హైస్కూలు హిందీ పండిట్, సామాజిక కార్యకర్త రాయల మల్లీశ్వరికి ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఆదివారం హైదరాబాద్‌లో డాక్టరేట్ ప్రదానం చేయనుంది.

కృష్ణయ్య మాస్టర్‌ను కొనసాగించండి



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7(ఆంధ్ర జ్యోతి): మాస్టారు తొందు కృష్ణయ్యను కొనసాగించాలంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు ధర్నాకు దిగారు. తొట్టంబేడు మండలం ఎగువ సాంబయ్యపాళెం జడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కృష్ణయ్య అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడన్న ఆరోపణలున్నాయి. దీనిపై ఆయనను గురువారం సస్పెండ్ చేశారు. దీంతో శుక్రవారం విద్యార్థులు మూకుమ్మడిగా తరగతులను బహిష్కరించారు. సస్పెన్షన్ ఎత్తివేయాలంటూ ధర్నాకు దిగారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు మద్దతు ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఎంఈవో భారతి పాఠశాల వద్దకు చేరుకున్నారు. వారితో చర్చించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల అభ్యర్థనను డీఈవోకు లేఖ రాస్తానని వివరించారు. త్వరలోనే సస్పెన్షన్ తొలగించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. దాంతో ధర్నాను విరమించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాగలాపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బానాయుడు కండ్రిగ, టీరకుప్పం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీ రమేష్ చంద్ర తెలిపారు. నాగలాపురంలో మాత్రం విద్యార్థులకు పరీక్షల కారణంగా మినహాయింపు ఉందని వివరించారు.

రహదారి నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న ఎంవీఐ దామోదర్‌నాయుడు

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 7(ఆంధ్ర జ్యోతి): వాహన చోదకులు రహదారి నియమాలు పాటించాలని శ్రీకాళహస్తి ఎంవీఐ దామోదర్ నాయుడు సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీసిటీ లోని ఇసుజు పరిశ్రమలో అక్కడి సిబ్బందికి, డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని తెలియ జేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులోని వారు సీటు బెల్టు ధరించాలని సూచించారు. పరిశ్రమ డిప్యూటీ జనరల్ మేనేజరు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

నవదంపతులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండల హౌసింగ్ ఏఈ గోపి వివాహం గురువారం రాత్రి జరిగింది. నవ దంపతులను ఎమ్మెల్యే కోనేటి ఆది మూలం నీర్పాకోట గ్రామంలో శుక్రవారం ఆశీర్వదించారు.

కోలాహలంగా జూనియర్ కళాశాల వార్షికోత్సవం



సమావేశంలో ప్రసంగిస్తున్న హెచ్‌ఎం కస్తూరయ్య

నాగలాపురం, ఫిబ్రవరి 7,(ఆంధ్ర జ్యోతి): నాగలాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 44వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో బాబయ్య, విశ్రాంత ప్రిన్సిపాల్ సుబ్బారావు, చెంగల్ రాయులు విచ్చేశారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు దేవేంద్ర, రెడ్డెప్ప, వేలాయుధం తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోల కేంద్రం వద్ద ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1గంట వరకు వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ మునిరవిచంద్ర తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

సూళ్లూరుపేట: చెంగాళమ్మ ఆలయం, మన్నారుపోలూరులో ఉన్న 220 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సూళ్లూరుపేట పట్టణం బాపూజీవీధి, పరమేశ్వరి నగర్, సాయినగర్, రైల్వేగేటు పడమటివైపు, మన్నారుపోలూరు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరాఫరాకు ఉండదని ఏడీఈ శేఖర్ తెలిపారు.

రాయితీ రుణాలను అర్హులందరికీ ఇవ్వాలి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా అందించే రుణాలను అర్హులందరికీ ఇవ్వాలని లీడ్‌బ్యాంక్ మేనేజర్ విశ్వనాథరెడ్డి అన్నారు. శుక్రవారం సూళ్లూరుపేట మండల సమాఖ్య కార్యాలయంలో సూళ్లూరుపేట, తడ, దొరవారి సత్రం మండలాల అధికారులు, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులు ఎటువంటి షరతులు లేకుండా అర్హులందరికీ రుణాలను అందజేయాలన్నారు. అదే విధంగా పొదుపు గ్రూపులో ఉన్న సభ్యులు రూ.5 లక్షలు వరకు వ్యక్తిగత రుణాలు తీసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమీలారాణి, ఏపీవీలు ప్రసన్న, రాజారెడ్డి, సీసీలు ఉమాశంకర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జల వనరుల పెంపునకు చర్యలు

కాళంగి గ్రాయిన్, మీజూరు చెక్ డ్యాం, పెళ్లకూరు మినీ రిజర్వాయర్ నిర్మాణానికి ప్రణాళిక



దెబ్బతిన్న కాళంగి గ్రాయిన్ (ఫైల్‌ఫొటో)

తడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో జల వనరులను పెంపొందించేందుకు ఎమ్మెల్యే విజయశ్రీ శ్రీకారం చుట్టారు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో మూలపడ్డ జలవనరుల పథకాలకు మహర్దశ తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా కాళంగి నది పులికాట్ సరస్సులో కలిసేచోట గ్రాయిన్ ఏర్పాటు, పెళ్లకూరులో మినీ రిజర్వాయర్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశారు. సూళ్లూరుపేట, తడ మండలాలకు సాగు, తాగునీటికి కాళంగి నది నీళ్లు ఎంతో ఉపయోగపడతాయి. పులికాట్‌లో సరస్సులోని ఉప్పునీరు కాళంగిలోకి వచ్చేస్తుండడంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో భూగర్భజలాలు ఉప్పునీటిమయం అయిపోతుండడంతో గ్రాయిన్ నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.9.80 కోట్లతో అంచనాలు రూపొందించి ఐదు సార్లు టెండర్లకు ఆహ్వానించినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఇక దొరవారిసత్రం మండలం మీజూరు వద్ద మూడు చోట్ల చెక్ డ్యాంల నిర్మాణానికి అటవీశాఖ అడ్డంకులతో అడుగు ముందుకు పడలేదు. వీటితో పాటు పెళ్లకూరు వద్ద మినీ రిజర్వాయర్ నిర్మిస్తామని 2017లో అప్పటి ప్రతిపక్ష నేత జగన్ హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదు.

కూటమి ప్రభుత్వంలో కదలిక

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జల వనరులశాఖ పనుల్లో కదలిక వచ్చింది. ముఖ్యంగా తడ మండలం వాటంబేడు వద్ద గ్రాయిన్ నిర్మాణానికి ఓకే చెప్పింది. 135 మీటర్ల పొడవుతో వరదనీటిని నిల్వ చేసేలా గేట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించి, ఆ మేరకు రూ.23 కోట్లతో అధికారులు అంచనాలు సిద్ధం చేశారు. ఇక దొరవారిసత్రం మండలం మీజూరు, కారికాడు, ఏలికాడు వద్ద 1.2 మీటర్ల ఎత్తుతో నాలుగు చెక్ డ్యాంలను నిర్మించేందుకు రూ.6 కోట్లతో అంచనాలు రూపొందించారు. పెళ్లకూరులో మినీ రిజర్వాయర్ కోసం రూ.32 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారు. ఈ మూడు పథకాలకు అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి పంపామని, నుంచి అనుమతులు రాగానే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని జలవనరుల శాఖ డీఈ శ్రీధర్ తెలిపారు.

త్వరలోనే అనుమతులు: ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట నియోజకవర్గంలో సాగు, తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో తమ మొదటి ప్రాధాన్యంగా కాళంగి గ్రాయిన్, చెక్ డ్యాంలు, మినీ రిజర్వాయర్ నిర్మించాలని నిర్ణయించామని ఎమ్మెల్యే విజయశ్రీ తెలిపారు. ఈ మేరకు నివేదికలను ప్రభుత్వానికి పంపామని, త్వరలోనే అనుమతులు తీసుకొచ్చి, ఆ పనులను ఏడాదిలో పూర్తయ్యేలా చూస్తామని ఎమ్మెల్యే చెప్పారు.

పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలి: ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్మయి, పక్కన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను పెండింగ్‌లో లేకుండా వెంటనే పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ చైర్మన్ ఆర్డీవో కిరణ్మయి అన్నారు. శుక్రవారం సూళ్లూరుపేట మండల పరిషత్ కార్యాలయంలో డివిజన్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ చట్టం కింద నమోదైన కేసుల పురోగతిని క్రమం తప్పకుండా పరిశీలించి పర్యవేక్షణ చేయడం ద్వారా బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలు, నమోదైన కేసులను తక్షణమే విచారించి బాధితులకు న్యాయం జరిగేలా ప్రత్యేక చొరవ తీసుకొంటుదన్నారు. కార్యక్రమంలో నాయుడుపేట, శ్రీసిటీ, పుత్తూరు డీఎస్పీలు చెంచుబాబు, పైడేశ్వరరావు, రవికుమార్, సీఐలు మురళీకృష్ణ, సంపమేశ్వరరావు, సూళ్లూరుపేట, దొరవారిసత్రం, నాయుడుపేట తహసీల్దార్లు ఎస్‌వీ నరసింహరావు, శైలాకుమారి, రాజేంద్ర ఎంపీడీవో ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్‌లో నాయుడుపేటవాసులకు పురస్కారం



నేషనల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్‌లో పురస్కారంతో నాయుడుపేట వాసులు

నాయుడుపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఒడిసాలోని రూర్కెలాలో ఈనెల 1, 2 తేదీల్లో జరిగిన నేషనల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్ (ఎన్‌ఈఎస్)లో నాయుడుపేటకు చెందిన డాక్టర్ సుజిత్‌మౌళి, సత్యం కుమార్, సుస్యంక్ పురస్కారం అందుకున్నారు. నేషనల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్‌లో 70మంది పాల్గొని తమ థీసెస్‌లో వివిధ రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఊపిరితిత్తుల ఎక్స్‌రేలో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్(ఏఐ) ద్వారా ముందస్తుగా టీబీని గుర్తించే థిసెస్ సమర్పించిన డాక్టర్ సుజిత్‌మౌళి, సత్యంకుమార్, సుస్యంక్ బృందం రన్నర్‌గా నిలవడంతో పురస్కారం అందించారు.

నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో నేడు భీష్మ ఏకాదశి వేడుకలు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట స్వర్ణముఖినది తీరాన వెలసిన ప్రసూనాంబసమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శనివారం భీష్మ ఏకాదశి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ గూడూరు సుధీర్‌రెడ్డి తెలిపారు. ఉదయం గణపతిహోమం, మహాన్యాశపూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, సాయంత్రం రుద్రహోమం, అమ్మవారికి సామూహిక సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహిస్తామన్నారు.

గురుకుల విద్యార్థులకు వైద్య పరీక్షలు

వాకాడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో శుక్రవారం బాలిరెడ్డిపాళెం వైద్య అధికారిణి దీప్తి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ దీప్తి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి సలోమీ, ఏఎన్‌ఎం ఇంగిలీల నాగమణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేవైఎం ప్రతినిధులు

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పోటుపాళెం జాతీయ రహదారి వద్ద అండర్ పాస్‌ను నిర్మించేందుకు రూ.45.82 కోట్లు మంజూరు చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ అభినందనలు తెలిపారు. శుక్రవారం స్థానిక బీజేవైఎం కార్యాలయం వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో శివశంకర్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

చిల్లకూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అదానీ ఫౌండేషన్ ప్రతినిధి సాయినాథ్ అన్నారు. శుక్రవారం మండలంలోని తమ్మినపట్నం గ్రామంలో అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పారిశుధ్యం మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచు సుబ్రహ్మణ్యం, అరుణ్, రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు, ఈశ్వరయ్య, మధురానగర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అన్నదానం

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారుపేట బీసీ కాలనీలో ఉన్న విష్ణుదుర్గా పరమేశ్వరి ఆలయంలో రాజశ్యామల నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వివేకానంద యువసైన్యం ఆధ్వర్యంలో ఏపీపీ ప్రకృతికుమార్ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సోమల భాస్కర్ రాజు, కుమరన్, చిన్నమద్దెరి గోపీనాథ్, గుగ్గిళ్ల కోటీశ్వరరావు, గణేష్, శ్రీనివాసులు, మోహిత్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల చర్చలు సఫలం



కమిషనర్ ఫజులుల్లాకు వినతిపత్రం ఇస్తున్న మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్మికులు

నాయుడుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులు, యూనియన్ గౌరవ అధ్యక్షుడు చాపల వెంకటేశ్వర్లు, కమిషనర్ ఫజులుల్లా నడుమ చర్చలు సఫలం అయ్యాయి. శుక్రవారం కార్మికులతో పాటు చాపల వెంకటేశ్వర్లు, కమిషనర్ ఫజులుల్లాను కలిసి మాట్లాడారు. కార్మికులకు రావాల్సిన బకాయిలను రెండు నెలల్లో పూర్తిస్థాయిలో చెల్లిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. అలాగే కార్మికులు మృతి చెందితే వారి కుటుంబాలకు రూ.2 లక్షల పరిహారం, సంక్రాంతి బోనస్‌గా రూ.1000 అందిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు మధు, హరి, శ్యామలమ్మ, మహాలక్ష్మమ్మ, ఆళావళి, మస్తానయ్య, మణి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నిర్మూలనతో ఆరోగ్యం

చిట్టమూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నులి పురుగుల నిర్మూలనతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో మనోహర్ గౌడ్ అన్నారు. ఈనెల 10 నుంచి 17 వరకు జరిగే నులి పురుగుల నిర్మూలన వారోత్సవం పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యాధికారిని పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలన మాత్రల పంపిణీ

వాకాడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని మండలంలో పకడ్బందీగా నిర్వహించామని వైద్యాధికారిణి దీప్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏఎన్‌ఎం, ఆశా, ఐసీడీఎస్ సిబ్బందికి నులిపురుగుల నిర్మూలన మాత్రలు అందజేశారు. ఎంపీడీవో అన్నపూర్ణరావు మాట్లాడుతూ ఈనెల 10న 19 యేళ్లలోపు వయస్సు గల పిల్లలందరికీ ఆల్‌బెండజోల్ మాత్రలు వేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు రామయ్య, కమ్యూనిటీ హెల్త్ అధికారి సలోమీ పాల్గొన్నారు.

అంతా గోప్యమే!

పెద్దిరెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

కల్లూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం మంగళంపేట సమీప అటవీ ప్రాంతంలో వున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు, జేసీ విద్యాధరి, డీఎఫ్‌వో భరణి తదితర అధికారుల బృందం పరిశీలించింది.పెద్దిరెడ్డి భూ ఆక్రమణలపై ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో గత శుక్రవారం ఆ భూములున్న ప్రాంతాన్ని జేసీ విద్యాధరి, డీఎఫ్‌వో భరణి పరిశీలించి సర్వే చేశారు కానీ వివరాలు బయటకు వెల్లడించలేదు.వారం రోజుల తరువాత రెండవసారి జేసీ విద్యాధరి, డీఎఫ్‌వో భరణి, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ జయసింహ, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు శుక్రవారం ఉదయం ఆ ప్రాంతానికి చేరుకున్నారు. మరికొంత సేపటికి కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ అక్కడికి చేరుకుని అధికారులతో మాట్లాడారు.ఒక గంట తరువాత కలెక్టర్, ఎస్పీ వెళ్లిపోగా మధ్యాహ్న సమయానికి మిగిలిన అధికారులు అక్కడినుంచి కల్లూరు జడ్పీ బంగళాకు చేరుకున్నారు. మధ్యాహ్న భోజనం తరువాత మరోసారి వ్యవసాయ క్షేత్రం వద్దకు చేరుకున్న వారు సాయంత్రం వెనుదిరిగారు. అక్కడ పరిశీలించిన అంశాలను బయటకు వెల్లడించకుండా గోప్యత పాటించారు. ఆ వ్యవసాయ క్షేత్రానికి వెళ్లే మార్గంలో సుమారు 5 కిమీ దూరం ముందే పోలీసులు లోపలికి ఎవరినీ అనుమతించలేదు. ఆ మార్గంలో భూములున్న రైతులను సైతం వారి భూముల వద్దకు వెళ్లేందుకు ఆ మార్గంలో అనుమతించకపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు.

పుత్తూరు వార్తలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పుత్తూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండలంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అర్బన్ ఏఈ జయసాయి తెలిపారు. సబ్ స్టేషన్, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని వివరించారు.

వైసీపీ మండల అధ్యక్షుల నియామకం

పుత్తూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండలంలోని మున్సిపాలిటీ కి ఏకాంబరం, రూరల్‌కు లోకనాథాన్ని వైసీపీ అధ్యక్షులుగా ఆ పార్టీ నియమిం చింది. నూతన అధ్యక్షులు మాట్లాడుతూ తమ నియామ కానికి సహకరించిన మాజీ మంత్రి రోజాకు కృతజ్ఞతలను తెలిపారు.

10న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని పలు విభాగాల సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ మంజు నాథ్ గౌడ్ ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయంలో నులిపురుగుల నిర్మూలన దినోత్సవ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అంగన్వాడీ కేంద్రం పిల్లలకు, ఇతర అన్ని పాఠశాలల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు అందజేయాలని సూచించారు. వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ముద్దుకృష్ణమ నాయుడికి ఘన నివాళి



ముద్దుకృష్ణమ నాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పోతుగుంట విజయ్ బాబు

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గ అభివృద్ధికి దివంగత నేత గాలి ముద్దుకృష్ణమ నాయుడు అహర్నిశలు కృషి చేశారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు అన్నారు. శుక్రవారం ఎంబీ రోడ్డులోని తన కార్యాలయంలో ముద్దుకృష్ణమ నాయుడు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. నాయకులు ధనపాల్, దాసరి విజయ్‌చౌదరి, చంద్రయాదవ్, అజయ్ చౌదరి, మణికంఠ, కుమార్ రెడ్డి, నాగభూషణం, పోతుగుంట రమేష్ పాల్గొన్నారు.

ముద్దు సమాధి వద్ద టీడీపీ నాయకుల నివాళి



పుత్తూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్ర జ్యోతి): మాజీ మంత్రి గాలి ముద్దు కృష్ణమ నాయుడు వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద టీడీపీ నాయకులు నివాళులు అర్పించారు. శివశంకర్ నాయుడు, నెట్టేరి శివ, నెట్టేరి మోహన్‌నాయుడు, కరుణాకర్‌చౌదరి పాల్గొన్నారు.

కలగా మిగిలిన రైతు బజార్లు



రోడ్డుపైన కూరగాయలు అమ్ముతున్న రైతులు

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వ్యాపారులు, రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేయదలిచిన రైతు బజార్లు జిల్లాలో అన్నిపట్టణాల్లో ఉన్నాయి. పుత్తూరులో మాత్రం కలగానే మిగిలిపోయింది. గతంలో టీడీపీ ప్రభుత్వంలో పుత్తూరు మార్కెట్ యార్డులో రైతు బజార్లు ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభు త్వం అధికారంలోకి వచ్చాక రైతు బజారు కేంద్రాల్లో విక్రయాలు చేయడానికి పన్నులు చెల్లించాలని అటు మున్సిపల్ అధికారులు, ఇటు మార్కెట్ కమిటీ అధికారులు సూచించారు. ఇద్దరికీ పన్నులు చెల్లించలేక చాలామంది రైతులు రైతు బజారుకు రావడం మానేశారు. దీనికి తోడు మున్సిపల్ అధికారులకు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చెందిన అధికారులకు పన్ను వసూళ్ల విషయంలో వివాదం నెలకొంది. ఎవరికి పన్ను కట్టాలో దిక్కుతోచని రైతులు రోడ్డున పడ్డారు. పంటలను అమ్మడానికి సరైన స్థలం లేకపోవడంతో చాలామంది రైతులు తమ సరుకులను, కూరగాయలను రోడ్డు పక్కనే ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం మున్సిపల్ అధికారులకు మాత్రమే మార్కెట్ రుసుం చెల్లించి తమ పంటలను అమ్ముకుంటున్నారు. అయితే మౌలిక వసతులు కల్పించడం లేదని, తమకు అమ్మకాలకు సరైన ప్రదేశాలను చూపించలేదని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రైతు బజార్లు ఏర్పాటు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

పాఠశాలకు ఫ్యాన్‌ల వితరణ



ఉపాధ్యాయులకు ఫ్యాన్‌లు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొక్కల చేను గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు తిరుపతికి చెందిన ఐక్యం చారిటబుల్ ట్రస్టు తరఫున రూ. 10వేలు విలువైన నాలుగు సీలింగ్ ఫ్యాన్లు, వైట్ బోర్డును శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు జగన్నాథానికి వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ చింతం శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శి సాయి ధనశేఖర్, ట్రెజరర్ యుగంధర్, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేను పరిశీలించిన అసిస్టెంట్ డైరెక్టర్



రికార్డులను పరిశీలిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్‌కుమార్

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమార వెంకటాపురం గ్రామంలో జరుగుతున్న రీసర్వేను రీ సర్వే విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ సర్వే గుర్తులు, గ్రామ బ్లాక్, సరిహద్దులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను వారి భూముల వద్దకు పిలిపించి సర్వేచేసి సమస్యలు తలెత్తకుండా చేయాలన్నారు. అడంగళ్‌తో పోల్చి వెబ్‌సైట్లో ఉన్న పొరపాట్లను తహ సీల్దార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ డిప్యూటీ సర్వేయర్ ప్రసాద్‌రావు, మండల సర్వేయర్ రాజ్‌కుమార్, ఆర్ఐ నల్లయ్య, వీర్వోలు మురళి, తేజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి అంబేద్కర్ జయంతి



రమాబాయి అంబేద్కర్ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7(ఆంధ్ర జ్యోతి): శ్రీకాళహస్తి మండలం ఎగువవీధి జడ్పీ ఉన్నత పాఠశాలలో మాతా రమాబాయి అంబేద్కర్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహిం చారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివా ళులు అర్పించారు. ఈ సందర్భంగా రమాబాయ్ సంఘం వివాహ పరిచయ వేదిక రాష్ట్ర వ్యవస్థాపకుడు రేగంటి దేవానంద్ మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ సతీమణి మాతా రమాబాయి అన్నారు. అంబేద్కర్ ఎదుగుదలకు ఎంతో సహక రించారని తెలిపారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బలక్ష్మి, జనార్ధన్‌నాయుడు, పోతురాజు, శివకుమార్, నాగమణి, మునికృష్ణారెడ్డి, సుచిత్ర పాల్గొన్నారు.

బీసీలకు అండగా చంద్రబాబు



మాట్లాడుతున్న బీసీ విభాగం నాయకులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బీసీలకు అండగా సీఎం చంద్రబాబు నిలుస్తున్నారని టీడీపీ బీసీ విభాగం నాయకులు అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం జరిగిన క్యాబినెట్ సమావేశంలో నామినేటెడ్ పదవుల భర్తీలో బీసీలకు 34శాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మిన్నల రవి, ఉమేష్‌రావు, నెమళ్లూరు బుజ్జి, మునిరాజా యాదవ్, బాస్కర్, మణి, ఉపేంద్ర, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పద్మావతమ్మ ఊంజల్ సేవ



నారాయణవనం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో వెలసిన కళ్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల్ సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామి, పద్మావతి అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు జరిపించారు. ప్రత్యేక అభిషేకాలు చేశారు. సాయంత్రం అమ్మవారికి నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి వేద పండితుల మంత్రోచ్చరణతో ఊంజల సేవ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయాధికారి నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

సంత సముదాయాలు ప్రారంభం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7(ఆంధ్ర జ్యోతి): ఏర్పేడు మండలం ముసలిపేడు గ్రామంలో నాబార్డు నిధులతో ఏర్పాటు చేసిన సంత సముదాయాలను శుక్రవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి ప్రారంభించారు. ఆమెకు టీడీపీ నాయకులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు.

ఘనంగా గాలి ముద్దుకృష్ణమనాయుడి వర్ధంతి

అన్నదానం, ఆస్పత్రిలో దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ కూడలిలో ముద్దుకృష్ణమనాయుడి చిత్రపటం ఏర్పాటు చేసి ఆయన తనయుడు ఎమ్మెల్యే గాలి బానుప్రకాష్‌తో పాటు పార్టీ శ్రేణులు, అభిమానులు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నిరుపేదలకు అన్నదానం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చినబాబు, మాజీ ఎంపీపీ ఏలుమలై, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ధనపాల్, మున్సిపల్ మాజీ చైర్మన్ యుగంధర్, ప్రతాపరాజు, మాజీ వైస్ చైర్మన్‌లు షణ్ముగరెడ్డి, మాజీ వార్డు సభ్యులు విజయ్‌బాబు, కౌన్సిలర్ ప్రసాద్‌నాయుడు, పార్టీ రూరల్ అధ్యక్షులు రవికుమార్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

నేడు గ్రామోత్సవం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి గ్రామోత్సవం భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని శనివారం నిర్వహించ నున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9గంటలకు స్వామి అమ్మవార్లతో పాటు, శ్రీవల్లీ దేవసేన సమేత చెంగల్వరాయస్వామి గ్రామోత్సవం బాబుఅగ్రహారం కోనేరుమీదుగా కుమారస్వామి తిప్ప చేరుకుని తిరిగి మధ్యాహ్నం 2.30గంటలకు ఆలయానికి చేరుకుంటుందని వివరించారు. న్నారు.

13న ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం 13వ తేదీ గురువారం లెక్కించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆలయ అధికారులు, ఉద్యోగులు ఈ హుండీ లెక్కింపులో పాల్గొనాలని సూచించారు.

నిశ్చితార్థ వేడుకల్లో టీడీపీ నాయకుడు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్‌రాయుడు కుమార్తె డాక్టర్ మాధురి, ప్రతీక్ నిశ్చితార్థ కార్యక్రమం శుక్రవారం శ్రీకన్వెన్షన్ హాలులో జరిగింది. ఈ వేడుకలకు టీడీపీ తిరుపతి పార్లమెంటు రైతు ఉపాధ్యక్షులు తక్కులపాటి ప్రకాష్‌నాయుడు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తిరుపతి రూరల్ ఈఈ చిన్నరెడ్డెప్ప తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో భాగంగా 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు, 11 కేవీ లైన్ల నెలవారీ మరమ్మతులు చేస్తున్న కారణంగా ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, తొట్టంబేడు, ఏర్పేడు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఎస్ఐని సన్మానించిన ఎమ్మెల్యే ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : రిపబ్లిక్ నాడు కలెక్టర్, ఎస్పీ నుంచి ఉత్తమ ఎస్ఐగా ప్రశంసా పత్రం అందుకున్న విశ్వనాథనాయుడును ఎమ్మెల్యే ఆదిమూలం శుక్రవారం పోలీసుస్టేషన్‌లో సన్మానించారు.

పిచ్చాటూరు వైసీపీ అధ్యక్షుడిగా చలపతిరాజు

పిచ్చాటూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండల వైసీపీ అధ్యక్షుడిగా చలపతిరాజును నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అధిష్ఠానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

మాడవీధుల అభివృద్ధికి సహకరించండి



దుకాణదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో చతుర్మాడ వీధుల అభివృద్ధి కోసం వ్యాపారులు సహకరించాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రానున్న మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని చతుర్మాడ వీధుల్లో 14రోజుల పాటు స్వామి అమ్మవార్ల ఊరేగింపులు, కల్యాణం, రథోత్స వం వంటి ప్రధాన ఘట్టాలు జరగనున్నాయి. చుతర్మాడ వీధుల్లో రోడ్ల విస్తరణకు వ్యాపారులు సహకరిం చాలని ఎమ్మెల్యే వ్యాపారులను వివరించారు. శుక్రవారం ఆయన పురపాలకసంఘ అధికారులతో కలిసి నాలుగు వీధుల్లో తిరిగారు. ఇంటింటికీ వెళ్లి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, నాయకులు రంగినేని చెంచయ్య నాయుడు, కంఠా రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఊరందూరులో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని జిల్లా ఆర్టీసీ డీపీటీవో నరసింహులు, డిప్యూటీ సీటీఎం విశ్వనాథ్, శ్రీకాళహస్తి డిపో మేనేజరు మునిచంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను ఘనంగా సత్కరించారు.

ఈ నెలాఖరుకు సిమెంట్ రోడ్లను పూర్తిచేయాలి



మాట్లాడుతున్న ఈఈ నాగరాజు నాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరుకు సిమెంట్ రోడ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని పంచాయత్ రాజ్ ఈఈ నాగరాజునాయుడు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో శుక్రవారం పల్లె పండుగ సిమెంట్ రోడ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి పల్లె పండుగలో భాగంగా రూ.2.66కోట్లు 54 పనులకు మంజూరయ్యాయని తెలిపారు. ఇప్పటివరకు 33 పనులను పూర్తి చేశారని మిగతా 21 పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ పనులు పూర్తయితే మండలంలో నాలుగు కిలోమీటర్ల సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ వెంకటరమణ, ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, ఏఈ నాగరాజు పాల్గొన్నారు.

ఎస్‌డీకే నగర్‌లో పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు అందజేస్తున్న డీఎస్పీ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7(ఆంధ్ర జ్యోతి): రమా చారిటబుల్ ట్రస్టు వారు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పట్టణంలోని ఎస్‌డీకే నగర్‌లో రమా చారిటబుల్ శాఖను డీఎస్పీ నరసింహమూర్తి, తొట్టంబేడు తహసీల్దారు మధుసూదన్‌రావు శుక్రవారం ప్రారంభించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో తమ కార్యకలాపాలను ప్రారంభించడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు పున్నేపల్లి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి సుమలత, కోశాధికారి పరమేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ..ఇద్దరికి గాయాలు

నారాయణవనం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలని కీళగరంలో ఇరువర్గాల ఘర్షణలో ఇద్దరికి గాయాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రాజశేఖర్ కథనం మేరకు.. కీలగరం బీసీ కాలనీలో నివాసం ఉంటున్న ధర్మలింగం ఇంటి వెనుక మణికంఠన్ తన స్థలంలో పశువుల కొట్టం నిర్మించుకున్నాడు. ఈ క్రమంలో పేడ దిబ్బల కారణంగా దుర్వాసన వస్తోందనే విషయంపై ఇరు కుటుంబాల వారు గొడవలు పడేవారు. రెండు రోజుల క్రితం మాటమాట పెరిగి గొడవకు దారితీసింది. రాత్రి ధర్మలింగం తన ఇంట్లో కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేస్తుండగా మణికంఠన్ తన అనుచరులతో వచ్చి దాడిచేసి గాయపరిచాడు. ఈ దాడిలో ధర్మలింగం, అతని పెద్దకుమారుడు లోకేష్‌కు గాయాలయ్యాయి. ధర్మలింగం చిన్నకుమారుడు చిన్నకుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామసభ

పిచ్చాటూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీజీ పురం సచివాలయంలో శుక్రవారం ఉపాధిహామీ సామాజిక గ్రామ సభ గ్రామ సర్పంచ్ శ్యామల అధ్యక్షతన జరిగింది. పంచాయతీ పరిధిలో జరిగిన పనులపై గ్రామసభలో ఎస్ఆర్‌పీ వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిశేఖర్‌రెడ్డి, గోపి, దేశయ్య, మురళీబాబు, రమేష్, పాల కృష్ణయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ముద్దు కృష్ణమనాయుడికి ఘన నివాళి



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

వడమాలపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు వర్ధంతి సందర్భంగా టీడీపీ నాయకులు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. నగరి ఎమ్మెల్యే గాలి బాను ప్రకాష్ తన తండ్రి ముద్దు కృష్ణమనాయుడు చిత్రపటానికి పుష్పాలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యం కేంద్రానికి దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

సత్యవేడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి నూతన కమిటీ ప్రమాణ స్వీకరం అట్టహాసంగా జరిగింది. శుక్రవారం ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే ఆదిమూలం, సభ్యులుగా హేమభూషణం రెడ్డి, శోభ, దనేష్ కుమార్ (ధన), ప్రమాణ స్వీకారం చేశారు. వీరి చేత ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ సురేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన కమిటీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఆస్పత్రి అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా ఆస్పత్రికి గత కొద్ది నెలలుగా 108 వాహనం లేక పోవడంపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రెండు రోజుల్లో ఆస్పత్రికి 108ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శ్రీసిటీ ఫౌండేషన్ అందించిన అంబులెన్స్‌ను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు. నూతన కమిటీ సభ్యులకు పలువురు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పరమశివం, టీబీఎస్ రెడ్డి, రాధయ్య, చిన్న, పీఎస్‌రాజు, శివానందం, శశి, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నీచ రాజకీయాలు మానుకోవాలి

● యథాస్థానంలో గౌతు లచ్చన విగ్రహ స్థాపన ● మీడియా సమావేశంలో టీడీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ నీచరాజకీయాలను మానుకోవాలని టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం టీడీపీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో ఆధ్యాత్మిక శోభ ప్రతిబింబించేలా రామసేతు వంతెన నుంచి ఏపీసీడ్స్ కూడలి వరకు విద్యుత్ కాం తులతో క్షేత్ర ప్రతిమలను ఏర్పాటు చేసే ప్రక్రియ జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా పీఆర్ అతిథి గృహం ఎదురుగా డివైడర్‌పై ఉన్న గౌతు లచ్చన్న విగ్రహాన్ని అధికారులు తాత్కాలికంగా తొలగించి భద్రపరిచారని గుర్తుచేశారు. వారం రోజుల నుంచి పాత డివైడర్‌ను తొలగించి యుద్ధప్రాతిపదికన కొత్త డివైడర్‌ను నిర్మించే పనులు జరుగుతున్నాయని వివరించారు. పనులు పూర్తయిన వెంటనే యథాస్థానంలో మరింత శోభాయమానంగా గౌతులచ్చన విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేస్తామని వివరించారు. అయితే అభివృద్ధి పనులను ఓర్వలేని వైసీపీ నేతలు గౌతు లచ్చన్న విగ్రహాన్ని తొలగించినట్లు దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, శ్రీకాళహస్తి నియోజకవర్గ గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దొరబాబు, గౌడ సంఘం నాయకులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు బలగాలతో గువ్వలకాలనీ ఖాళీ

రేణిగుంట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : చెన్నై-తిరుపతి రైల్వే బైపాస్ లైన్ నిర్వాసితులకు ప్రభుత్వం నష్ట పరిహారం మంజూరు చేసినా, పలుమార్లు ఖాళీ చేయాలని చర్చించినా ఫలితం లేకపోయింది. దీంతో శుక్రవారం తెల్లవారుజామున శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 200 మంది పోలీసులు, రెవెన్యూ అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బందితో గువ్వల కాలనీకి చేరుకున్నారు. పోలీసులు బందోబస్తు నడుమ ఖాళీ చేయించారు. నిర్వాసితులకు రూ.18వేల చొప్పన తాత్కాలిక సహాయం అందించారు. ప్రస్తుతానికి నిర్వాసితులకు చైతన్యపురం రాస్ కేంద్రంలో బస ఏర్పాటు చేశారు. కొందరు తమ బంధువుల ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సురేష్‌బాబు, సీఐ మురళీకృష్ణ, ఎస్ఐలు సుధాకర్, అరుణ్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు జైకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





గువ్వల కాలనీలో ఇండ్లను నేలమట్టం చేస్తున్న ఎక్స్‌కవేటర్, నిర్వాసితులకు నగదును అందజేస్తున్న వీఆర్వో